



తెనాలిలో పేదల ఇళ్లు ఉండాల్సిన కాలనీలో రెండంతస్తుల ఇల్లు

- జగనన్న కాలనీల్లో రియల్ దందా
- ప్లాట్ అమ్మబడును అంటూ బోర్డులు
- వైసీపీ అక్రమార్కుల చేతుల్లోకి ప్లాట్లు
- ప్రతి లేఅవుట్‌లోనూ 30 శాతం ఇళ్లు వారికే
- సొంతిళ్లు, కార్లు ఉన్న వారు లబ్ధిదారులట
- ఆ ఇళ్లలోనే పేకాట.. అసాంఘిక కార్యకలాపాలు

పేదల ఇళ్లు.. పెద్దలకు

ఇంటి ముందు కారు.. రెండంతస్తుల విలాసవంతమైన భవనం.. అందులో ఏసీ.. ఇతర ఆర్భాటపు హంగులు.. ఇదేదో ధనవంతులు ఉండే ప్రాంతం అనుకుంటే తప్పులో కాలేసినట్లే. పేదలు, నిరుపేదల కోసం అంటూ గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో కనిపించే దృశ్యాలు. అదేంటి.. పేదల కోసం ఏర్పాటు చేసిన కాలనీలు కదా.. అక్కడవారికి కార్లు, ఏసీలు, రెండంతస్తుల భవనాలు ఏమిటంటే. అదంతే.. వైసీపీ నేతల అక్రమాలకు కాలనీల్లోని ఈ దృశ్యాలు నిదర్శనంగా కనిపిస్తాయి. నిలువ నీడలేని నిరుపేదల కోసం జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీలో ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో అత్యధికులు పేరుకే పేదలు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో కేంద్ర ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం అర్హత లేకున్నా వైసీపీ కార్యకర్తలు, వారి అనుచరులై ఉంటే చాలన్నట్లుగా జగనన్న కాలనీలో ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో జగనన్నకాలనీల్లో నిరుపేదలకివ్వాల్సిన స్థలాలు, ఇళ్లు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. పక్కా భవనాన్ని ప్రభుత్వం కట్టిస్తుంటే దానిపై రెండు, మూడు అంతస్తులను పలువురు నిర్మించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం దిగిపోవడంతో ప్రస్తుతం జగనన్న కాలనీల్లో ఇళ్ల కేటాయింపుల్లో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన పొలాల్లో అక్రమాలు, నేతలు, ఎమ్మెల్యేలే కాంట్రాక్టర్ల అవతార మెత్తి చేసిన భారీ దోపిడీలు, నాసిరకం నిర్మాణాల వంటివే ఇప్పటి వరకు బయటకు రాగా.. నిబంధనలను తుంగలో తొక్కి మరీ వైసీపీ నాయకులు, వారు చెప్పిన వారికి ఇళ్లు కేటాయించడం మరో భారీ కుంభకోణమన్న ఆరోపణలున్నాయి.


తెనాలిలో పేదల ఇళ్ల కాలనీలో రెండంతస్తుల ఇల్లు

తెనాలి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేరుకే పేదలు... విలాసవంతమైన సొంతిల్లు, ఒకటి, రెండు కార్లు ఉన్నా వారు.. జగనన్న కాలనీల్లోని నిరుపేదలు. ఇళ్లు కొనబడును, అమ్మబడును అంటూ కాలనీల్లోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం. ఇందుకు సంబంధించి బహిరంగంగానే బోర్డులు దర్శనం. ఇదంతా ఇటీవల తెనాలి నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ జగనన్న కాలనీల పర్యటనలో వెలుగుచూశాయి. ఒక్కో లేఅవుట్‌లో 10 నుంచి 30 శాతం పైగా ఇళ్లు వైసీపీ నేతలు, వారి అనుచరులకు దక్కినట్లు సమాచారం. తెనాలి మండల పరిధిలోని జగనన్న కాలనీల్లో కొన్ని ఇళ్లు రెండు, మూడంతస్తులు ఉండటం, కార్లు, ఖరీదైన గృహోపకరణ, ఎలక్ట్రానిక్ పరికరాలు ఉండటం మంత్రి మనోహర్ చూసి విస్తుపోయారు. దీనికి తోడు కొన్ని ఇళ్లముందు ఇల్లు అమ్మబడును అని బోర్డులు కనిపించటం, మరికొన్ని ఇళ్లముందు రియలెస్టేట్ బోర్డులు కనిపించడంతో ముందు లబ్ధిదారుల జాబితాను పరిశీలించాలని, అనర్హులు ఉంటే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. వీటిపై దృష్టిపెడితే, కొందరికి సొంతిళ్లు పట్టణంలో ఉండటం, మరికొందరికి విద్యుత్తు మీటర్లు రెండు, మూడు ఉండటం, కార్లు, ఖరీదైన గృహోపకరణాలున్నట్లు ఆధారాలు లభించడంతో వాటిని తొలగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తెనాలి పరిధిలోని పెదరావూరు లేఅవుట్‌లో 1841 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వగా వారిలో 200 మంది అనర్హులుగా తేలారు. మిగిలిన లేఅవుట్లలో కూడా భారీగానే అనర్హుల జాబితా బయటపడుతోందని అధికారులు చెబుతున్నారు. ఇదే తీరులో గుంటూరు జిల్లా మొత్తంలో చూస్తే కనీసం 13 వేల నుంచి 18వేల వరకు అక్రమార్కుల చేతుల్లోకి పేదల స్థలాలు వెళ్లి ఉంటాయనేది అంచనా. గుంటూరు, నల్లపాడు, పొన్నూరు, మంగళగిరి వంటి పట్టణాల్లో ఈ తరహా అనర్హుల జాబితా భారీగానే ఉందనేది అధికారుల మాటే.

వైసీపీ కాంట్రాక్టర్‌లపై కేసులు


జగనన్న కాలనీ పేరుతో వైసీపీ సర్కారు ఇల్లు లేని పేదలకోసం ఇళ్ల స్థలాలిచ్చి, వాటిలో ఇల్లు కట్టించే పని చేపట్టింది. అయితే నిర్మాణ పనుల్లో, నిధులు గోల్‌మాల్, అడ్వాన్స్‌లు తీసుకుని పనులు చేయకపోవడం, నాసిరకం నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్ ముసుగులోని వైసీపీ నాయకులపై క్రిమినల్ కేసులకు వెనకాడటంలేదు. జనం సొమ్ము దోచేసి, వారి ఇళ్లు నిర్మించకుండా వారిపైనే దౌర్జన్యానికి పాల్పడిన సంఘటనలు గతంలో ఉండటంతో కాంట్రాక్టర్లపై కేసులు పెట్టడంపై లబ్ధిదారులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా తెనాలిలో ఐదుగురు కాంట్రాక్టర్లపై కేసులు నమోదు చేశారు. మిగిలిన కాంట్రాక్టర్లు తాము తీసుకున్న అడ్వాన్స్‌లు తిరిగి చెల్లించేందుకు ముందుకు రావడంతో వారికి తాత్కాలిక ఉపశమనం కల్పించారు. ఆరుగురు కాంట్రాక్టర్‌లపై కేసులు పెట్టేందుకు గృహనిర్మాణ శాఖ ముందుకు వస్తే, వారిలో ఓ వ్యక్తి ఎన్నికలకు ముందు కూటమి పార్టీలో చేరాడు. దీంతో అతను చెల్లించాలిన సొమ్ము భారీ మొత్తమే అయినా, కేసు నమోదు చేయకపోవటంపై విమర్శలు వస్తున్నాయి.

లబ్ధిదారుల పేరుతో నొక్కేసిన కాంట్రాక్టర్లు

కాలనీల్లో ఇంటి నిర్మాణానికి కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షలు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా ఇవ్వకపోగా, లబ్ధిదారులకు డ్వాక్రా రుణాల కింద రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు అప్పు మంజూరు చేయించి, వాటినికూడా కాంట్రాక్టర్ల అవతారమెత్తిన వైసీపీ నేతలే నొక్కేశారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడి కాంట్రాక్ట్ సంస్థ రాక్రీట్ భాగోతం బయటపడిన సంగతి తెలిసిందే. చాలాదగ్గర్ల స్థానిక నేతలు కూడా ఇళ్ల కాంట్రాక్టర్ అవతారమెత్తి మేసేశారు. వారికి ఏ అర్హతా లేకున్నా నిర్మాణ పనులు కట్టబెట్టారు. అయితే ఇప్పటి వరకు మొదలుపెట్టని ప్లాట్లలో ఏ పనులు చేయకూడదని, పనులు మొదలుపెట్టి వివిధ దశల్లో ఉన్న ఇళ్లను మాత్రం పూర్తిచెయ్యాలనేది ప్రభుత్వ షరతు. వీరి స్థానంలో కొత్తవారిని తీసుకొచ్చినా మెటీరియల్ లెక్కతేలక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. దీంతో వారితోనే పనులు పూర్తిచేయించి, మిగిలినవాటిని మాత్రం లబ్ధిదారుల ఇష్టానుసారం నిర్మించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

కట్టడి చేయండి..

జగనన్న కాలనీల్లో ఏంచేసినా గత ప్రభుత్వ కాలంలో పోలీసులు అడుగుపెట్టే పరిస్థితి లేదు. దీంతో నిర్మాణం పూర్తయిన, మధ్యలో ఆగిపోయిన ఇళ్లలో జూదం విచ్చలవిడిగా సాగిపోతోంది. కొన్ని కాలనీల్లో పోలీసులు నిఘా వేస్తే, కొన్ని ముఠాలు పట్టుబడినా, ఇంకా అసాంఘిక కార్యకలాపాలు సాగిపోతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగకుండా పేకాటతోపాటు వ్యభిచారం వంటివి జరుగుతున్నాయని వాటిని కట్టడి చేయాలని లబ్ధిదారుల కోరుతున్నారు.


తెనాలిలో పేదల ఇళ్ల కాలనీలో రెండంతస్తుల ఇల్లు


దెబ్బతిన్న నాగార్జునసాగర్ డ్యాం స్పిల్ వే

స్పిల్ వేకు.. కోత


- రూ.20 కోట్లతో గతేడాదే మరమ్మతులు
- పనుల్లో నాణ్యతా లోపాలతో మళ్లీ గండ్లు
- సాగర్ ప్రాజెక్టు నిర్వహణలో నిర్లక్ష్యంపై ఆందోళన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

22.35 లక్షల ఎకరాలకు సాగునీరు.. లక్షల జనాభాకు తాగునీరు.. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి.. కృష్ణానదిపై మానవనిర్మితమైన అతి పెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టు.. దేశంలోనే రెండో స్థానంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఉంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రధాన ప్రాజెక్టుగా ఉన్న సాగర్ ప్రాజెక్టు నిర్వహణపై నిర్లక్ష్యం అలుముకుంది. ప్రాజెక్టులో కీలకమైన స్పిల్ వే నిర్వహణ అత్యంత దారుణంగా ఉంది. ఇటీవల వరద పోటెత్తడంతో సాగర్ క్రస్ట్ గేట్లన్నీ ఎత్తి దాదాపు 5 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో వరద తాకిడికి స్పిల్ వే కోతకు గురైంది. ఇటీవల గేట్లన్నీ మూసేసి నీటి విడుదలను అధికారులు ఆపేశారు. దీంతో స్పిల్‌వేకు పడిన గండ్లు వెలుగుచూశాయి. డ్యాంలో అత్యంత కీలకమైన స్పిల్‌వే కోతకు గురవడం ఆందోళనకరంగా మారింది. వచ్చే వేసవిలో స్పిల్‌వేకు మరమ్మతు చేపడతామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నిర్వహణపై ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదకర పరిస్థితులు నెలకొంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పనులపై అనుమానాలు..

డ్యాం నుంచి నీరు కిందకు ప్రవహించే ప్రాంతాన్ని స్పిల్ వే అంటారు. వరద నీరు విడుదల చేసిన సందర్భంలో స్పిల్ వే కోతకు గురవుతుంది. డ్యాం భద్రత స్పిల్ వేతో ముడిపడి ఉండటంతో గత ఏడాది సుమారు రూ.20 కోట్లతో మరమ్మతులు చేశారు. వరద ఉధృతితో పడిన గండ్లను పూడ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి మరమ్మతులు చేపట్టామని అప్పట్లో అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో వరద ఉధృతికి స్పిల్ వే కోతకు గురికాకుండా ఉండేలా విదేశాల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన ఎం 60 గ్రేడ్ సిలికాన్ ఫైబరీ రీ ఇన్ఫోర్స్‌డ్ కాంక్రీట్‌ను వినియోగించామని నాడు అధికారులు ప్రకటించారు. అయితే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే మళ్లీ కోతకు గురవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాణ్యతా పరీక్షల్లో కూడా పనులు పటిష్ఠంగా జరగలేదని తేలినట్లు సమాచారం. ఈ కారణంగానే మరో సారి వరద ఉధృతికి స్పిల్ వే దెబ్బతిన్నదన్న విమర్శలున్నాయి. పనుల్లో నాణ్యత డొల్లతనం మరోసారి బయటపడటం గమనార్హం. పూర్తిస్థాయిలో నాణ్యత లోపించడం వల్లే స్పిల్ వే దెబ్బతిన్నదన్న వాదన వినిపిస్తోంది. సాగర్ ప్రాజెక్టు ఆధునికీకరణ పనుల సందర్భంగా కూడా రూ.60 కోట్లతో స్పిల్ వేను అభివృద్ధి చేశారు. అయినా స్పిల్‌వే కోతకు గురికావడం పరిపాటిగా మారింది. స్పిల్ వే నిర్మాణంలో లోపాలు ఉండటంతో మరమ్మతులు చేసినా దెబ్బతింటున్నట్లు జలవనరులు శాఖ ఇంజనీర్లు చెబుతున్నారు. జలాశయంలో కీలక భాగమైన స్పిల్ వే నిర్వహణలో అలసత్వాన్ని విడనాడాలని నిపుణులు సూచిస్తున్నారు. వరద ఉధృతికి కోతకు గురికాకుండా స్పిల్‌వేకు మరమ్మతులు చేపట్టాలన్న వాదన వినిపిస్తోంది.


దెబ్బతిన్న నాగార్జునసాగర్ డ్యాం స్పిల్ వే

6లో..

మండలికి ఆలపాటి



- పోటీకి టీడీపీ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం
- రాజా అభిమానుల్లో వెల్లివిరిసిన ఆనందం

ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆలపాటి

పట్టభద్రుల ఓటుకు.. నేడు నోటిఫికేషన్

- నవంబరు 6 వరకు ఫారం-18ల స్వీకారం
- అదే నెలలో క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు అవకాశం
- డిసెంబరు 30న తుది ఓటరు జాబితాల ప్రచురణ

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణ - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలకు సన్నాహక ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఓటర్ల నమోదు నిబంధనలు 1960 ప్రకారం రూల్ 31(3) కింద ఓటరు నమోదుకు నోటిఫికేషన్‌ని జిల్లా ఎన్నికల అధికారి ఎస్ నాగలక్ష్మి విడుదల చేస్తారు. ఆ మరుక్షణం నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకారం మొదలౌతుంది. 2016లో ఎన్నికల సంఘం జారీ చేసిన సవరణ ఆదేశాల మేరకు పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కొత్తగా ఓటుహక్కు కోసం నమోదు చేసుకుని ఓటరుగా నమోదు కావాల్సిందే. ఆ ప్రకారం ఎవరైతే 2024 నవంబరు 1కి పట్టభద్రులు అవుతారో వారంతా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. సోమవారం నుంచి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం అవుతుండగా అక్టోబరు 15, 25 తేదీల్లో రీ-పబ్లికేషన్‌ని ప్రచురిస్తారు. నవంబరు 6 వరకు ఫారం-18లో ఓటరు దరఖాస్తులు స్వీకరిస్తారు. నవంబరు 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. అదే రోజు నుంచి డిసెంబరు 9 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబరు 25 లోపు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిష్కరించి 30న తుది ఓటర్ల జాబితాలను ప్రచురిస్తారు. ప్రస్తుత ఎమ్మెల్సీ లక్ష్మణరావు పదవీకాలం 2025 మార్చి 29తో ముగుస్తుంది. ఈ దృష్ట్యా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్‌ని ఎన్నికల సంఘం జారీ చేసే అవకాశం ఉంది.



2,48,799 మంది ఓటర్లుగా 2019లో నమోదు

కృష్ణ - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి 2019లో ఎన్నిక జరిగింది. అప్పట్లో కృష్ణా జిల్లాలో 1,06,829, గుంటూరు జిల్లాలో 1,41,970 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. మొత్తంగా 2,48,799 మంది ఓటర్లుగా నమోదు కాగా పోలింగ్‌కు వచ్చేసరికి దాదాపుగా లక్ష మంది దూరంగా ఉన్నారు. 1,49,319 మంది పట్టభద్రులు ఆ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. వారి కోసం ఉమ్మడి కృష్ణా జిల్లాలో 153, ఉమ్మడి గుంటూరులో 209 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో గరిష్ఠంగా వెయ్యి మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చర్యలు చేపట్టారు. ఇప్పుడు జిల్లాల సంఖ్య పెరిగింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్‌టీఆర్, కృష్ణ జిల్లాలున్నాయి. అయితే వీటికి రాష్ట్రపతి నుంచి గజిట్ నోటిఫికేషన్ విడుదల కాలేదు. ఈ కారణంగా కృష్ణ - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీగా పరిగణిస్తారు. ఐదున్నరేళ్లలో గ్రాడ్యుయేట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో ఈ దఫా ఓటర్ల సంఖ్య మూడు లక్షలు దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఎక్సైజ్‌లో.. బదిలీలు

- సీఐల పోస్టింగ్‌ల్లో మార్గదర్శకాలకు పాతర
- నిబద్ధత, అంకితభావం కలిగిన వారికి అన్యాయం
- ఏసీబీ కేసులు, వైసీపీ నేతలతో అంటకాగిన వారికి గుంటూరులో పోస్టింగ్

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో జరిగిన సీఐ బదిలీలపై ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పనితీరులో అంకితభావం.. కేసులను పరిష్కరించి ఉన్నతాధికారుల ప్రశంసలను పట్టించుకోలేదు. నిబద్ధత.. అంకితభావం అవసరం లేదని నిరూపించారు. ఎంపీలు, ఎమ్మెల్యేల సిఫార్సులు బుట్టదాఖలయ్యాయి. ఏసీబీ కేసులు ఉన్నా- వైసీపీ ప్రభుత్వంలో ఆ నేతలతో అంటకాగిన వారికి గుంటూరులో పోస్టింగులు దక్కాయి. మొత్తంమీద అడ్డగోలుగా.. ఇష్టారాజ్యంగా ఎక్సైజ్ సీఐల బదిలీలు జరిగాయని శాఖలోని అధికారుల నుంచే ఆరోపణలు వస్తున్నాయి. ఎక్సైజ్ సీఐల పోస్టింగుల వ్యవహారంలో జరిగిన అక్రమాలు అంతాఇంతా కాకుండా ఉన్నాయి. బదిలీలకు సంబంధించి జీవో 75లో ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఏసీబీ కేసులు ఉన్నవారికి అప్రాధాన్య పోస్టులు, పనితీరు ఆధారంగా ప్రాధాన్య పోస్టులు కేటాయించాలని, ఒక్కో అధికారికి ఐదు ఆప్షన్లు అడిగారు. అయితే బదిలీల్లో ఈ మార్గదర్శకాలు, నిబంధనలను పట్టించుకోలేదు. రాష్ట్రంలో నాలుగు జోన్లు ఉండగా 3 జోన్లలో సీఐల బదిలీలు జరిగాయి. సర్వీసులో రిమార్క్ లేని వారికి అప్రాధాన్య పోస్టులు దక్కాయి. పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఓ అధికారికి గుంటూరులో తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగిన ఓ అధికారి ఎన్నికల ముందు కోరుకున్నచోట ఉద్యోగం చేశారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత ఆ అధికారిని వైసీపీ ఎంపీ తన ఇలాఖాలో పోస్టింగ్ వేయించుకున్నారు. తాజా బదిలీల్లో ఆ అధికారి గుంటూరులో పోస్టింగ్ వేయించుకున్నారు. గత ప్రభుత్వంలో, ఇప్పుడు ఆ అధికారికి కోరిన చోట పోస్టింగు రావడంపై ఆ శాఖ అధికారులే విస్తుపోతున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలు అసహనం

అడ్డగోలు బదిలీలపై ఎంపీ, ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమర్థతకు పట్టం కడుతూ కొందరిని తాము సిఫార్సు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైరవీలు చేసుకున్న వారికి ప్రాధాన్య పోస్టింగ్‌లు దక్కడంతో అసలు ఎక్సైజ్ శాఖలో ఏం జరుగుతుందని ఆరా తీస్తున్నారు. ఈ బదిలీల వ్యవహారంపై అమీతుమీ తేల్చుకునేందుకు నేతలు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

బదిలీలు.. బేరాలు

- పంచాయతీ ఆదాయాన్ని బట్టి రేటు
- కార్యదర్శుల నుంచి భారీగా ముడుపులు
- డీపీవోలో చక్రం తిప్పిన ఇద్దరు ఉద్యోగులు



గుంటూరు సిటీ, సెప్టెంబరు 29: పంచాయతీ ఆదాయాన్ని బట్టి రేటు.. ఆ మొత్తం చెల్లించిన వారికే పోస్టింగ్. ఇదీ పంచాయతీరాజ్‌లో కార్యదర్శుల బదిలీ తీరు. ఆదాయాన్ని బట్టి పంచాయతీలకు గ్రేడ్లు ఉంటాయి.. కానీ జిల్లాలో బదిలీలకు జరిగిన బేరాన్ని బట్టి గ్రేడ్లు మార్చి ఆ ప్రకారం బదిలీలు చేశారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగులు మధ్య వర్తులుగా ఉండి ఈ అశాస్త్రీయ తతంగాన్ని నడిపించారు. వారితో మాట్లాడి రేటు కుదుర్చుకున్న వారికి మేజర్ పంచాయతీలను మైనర్ పంచాయతీ కంటే తక్కువ ఆదాయాన్ని చూపించి కార్యదర్శులను బదిలీలు చేశారు. ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం పంచాయతీ ఇంటి పన్నుల ఆదాయమే రూ.60 లక్షలు. అక్కడకి బదిలీ కావాలంటే రూ.2 లక్షలు. రూ.లక్షల్లో ఆదాయం వచ్చే తాడికొండ మండలం లాం పంచాయతీకి బదిలీ కావాలంటే రూ.లక్ష ఇలా పంచాయతీ ఆదాయాన్ని బట్టి బదిలీలకు రేటు నిర్ణయించారు. బేరం కుదిరిన తర్వాత మేజర్ పంచాయతీలను గ్రేడ్-5 జాబితాలోకి నెట్టేశారు. నిషేధం అమల్లోకి వచ్చిన తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై అధికారులు హడావుడి చేశారు. పాత జీవోను, గెజిట్‌ను పూర్తిగా పక్కన పెట్టేశారు. గ్రేడ్- 5లో ఉన్న గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులకు మేలు చేసేలా ఇష్టానుసారంగా గ్రేడ్లు మార్చేసి పంచాయతీలను విడగొట్టారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత కొందరిని పిలిపించుకుని వారికి రహస్యంగా ఉత్తర్వులు అందజేశారని సమాచారం. బదిలీలపై డీపీవో కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగులు కలెక్టరేట్ అధికారులను ఉద్దేశ పూర్వకంగా తప్పుదారి పట్టించినట్లు తెలుస్తోంది. టీడీపీ ఎమ్మెల్యేలు చెప్పినా వినాల్సిన పనిలేదన్న ధోరణిలో ఓ ఉద్యోగి జాబితా తయారు చేసినట్లు తెలుస్తోంది. వారిని కలవనిదే కోరుకున్న చోటకి బదిలీ జరిగే అవకాశం లేదని పలువురు చెబుతున్నారు.

లాం ఇస్తామని...

ఓ పంచాయతీ కార్యదర్శికి తాడికొండ మండలంలోని లాంకు బదిలీ చేస్తామని రూ.లక్ష తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఏమి జరిగిందో కానీ అతడ్ని అక్కడికి మార్చలేదు. అమరావతి మండలం ధరణికోటలో జరిగిన బదిలీ కూడా ప్రశ్నార్థకంగా మారింది. పంచాయతీ కార్యదర్శులు కొందరు బదిలీ స్థానాన్ని మార్పించుకునేందుకు జిల్లా అధికారి కార్యాలయంలో పావులు కదుపుతున్నారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై కొందరు కోర్టుకి వెళ్లారు. గ్రేడ్-5 పేరుతో పంచాయతీ లను విడగొట్టి బదిలీలు చేస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం.

హీమోఫీలియాకు వరం 'ఎమిసిజుమ్యాబ్'



జీజీహెచ్‌లో హీమోఫీలియా చిన్నారులతో వైద్యులు



డే కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

- బాధిత పిల్లల చికిత్సకు 30 ఇంజెక్షన్లు
- ఒక్కొక్క ఇంజెక్షన్ ఖరీదు రూ.1.20 లక్షలు
- రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా గుంటూరు జీజీహెచ్ ఎంపిక
- డే కేర్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 29: హీమోఫీలియా వ్యాధిగ్రస్తుల్లో చికిత్సకు ఖరీదైన ఎమిసిజుమ్యాబ్ సూదిమందు ప్రభుత్వ వైద్య రంగంలోకి అందుబాట్లోకి వచ్చింది. వ్యాధితో బాధపడే చిన్నారులకు ఏడాది వ్యవధిలో 30 ఇంజెక్షన్లు చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్క ఇంజెక్షన్ ఖరీదు రూ.1.20 లక్షలు. రోగి శరీర బరువును బట్టి ఈ మోతాదు పెంచాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఏడాదిలో హీమోఫీలియా బాధితుడికి అయ్యే వైద్యం ఖర్చు సుమారు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉంటుంది. రాష్ట్రంలో తొలిసారిగా పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎమిసిజుమ్యాబ్ చికిత్స కేంద్రంగా గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిని ఎంపిక చేశారు. తొలి దశలో 15 మంది హీమోఫీలియా చిన్నారులను ఎమిసిజుమ్యాబ్ చికిత్సలకు ఎంపిక చేశారు. గత వారం నలుగురు చిన్నారులకు ఈ చికిత్సలను ప్రారంభించారు. రోగులకు మొదటి నెలలో వారానికి ఒకటి చొప్పున నాలుగు ఇంజెక్షన్లు చేస్తారు. మరుసటి నెల నుంచి 15 రోజులకు ఒక ఇంజెక్షన్ చొప్పున ఏడాది పాటు ఇస్తారు. 15 మంది పిల్లలకు ఏడాది సరిపోయే ఇంజెక్షన్లను ఇప్పటికే గుంటూరు జీజీహెచ్‌కు సమకూరాయి. ఇందుకోసం తొలి దశలో రూ.4.25 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఫ్యాక్టర్ 8కు ప్రత్యామ్నాయంగా..

హీమోఫీలియా పిల్లల్లో గాయమైతే రక్తస్రావం ఆగదు. కొందరిలో రక్తం గడ్డ కట్టడం, కీళ్లవాపు వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఇలాంటి వ్యాధిగ్రస్తులకు ఫ్యాక్టర్-8 అనే మందును చికిత్సగా ఇస్తారు. ఇది కూడా కొంతకాలం తర్వాత రోగుల్లో సమర్థవంతంగా పని చేయదు. ఇలాంటి వారికి ఎమిసిజుమ్యాబ్ ఇంజెక్షన్‌లను ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో ఫ్యాక్టర్ 8 మందు పని చేయని పిల్లలకు కూడా ఎమిసిజుమ్యాబ్ సమర్థవంతంగా పని చేస్తుంది. గుంటూరు జీజీహెచ్‌లోనే సుమారు 100 మంది హీమోఫీలియా బాధితులు చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతానికి ఎన్ఆర్‌హెచ్ కింద ఏపీ శ్యాక్స్ ఎమిసిజుమ్యాబ్ చికిత్సలకు హీమోఫీలియా చిన్నారుల ఎంపికను నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన పిల్లలను చికిత్సకు గుంటూరు జీజీహెచ్‌కి పంపుతున్నారు. బాధిత చిన్నారుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో చికిత్సల కోసం విశాఖపట్నం, కడప ప్రభుత్వాస్పత్రులను కూడా ఎంపిక చేశారు.

ప్రభుత్వం అండగా నిలుస్తుంది

ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో హీమోఫీలియా రోగుల కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను ఆదివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హీమోఫీలియా రోగులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 1100 మంది హీమోఫీలియా బాధితులు ఉన్నారని, వీరికి చక్కటి వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ వైకిరణ్‌కుమార్, హీమోఫీలియా సొసైటీ కార్యదర్శి మాగంటి ప్రసాద్ పాల్గొన్నారు.

బైకును ఢీకున్న కారు: వృద్ధుడి మృతి

చిలకలూరిపేట, సెప్టెంబరు 29: చిలకలూరిపేట - నరసరావుపేట రహదారిపై ఆదివారం మధ్యాహ్నం కావూరు కోమటినేనివారిపాలెం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగన్నపాలెం గ్రామానికి చెందిన వృద్ధుడు మరణించాడు. ఇతడు చిలకలూరిపేట నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పాల వ్యాపారం చేసుకునే గుంజి రామారావు(68)గా గుర్తించారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీడీసీసీ బ్యాంకు నూతన పాలకవర్గ ఎంపిక



శ్రీనివాసన్



బాలాజీ ప్రసాద్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 29: జీడీసీసీ బ్యాంకు ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం తెనాలిలో నిర్వహించారు. బోసురోడ్డులోని జీడీసీసీ బ్యాంకు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షునిగా సుంకర శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి ఓలేరు బాలాజీప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా మహేంద్రరావు, కోశాధికారిగా దొప్పలపూడి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సమావేశంలో వేతన సవరణ, ఉద్యోగులకు పదవీ విరమణ వయసు పెంపు, బీమా సౌకర్యం, బదిలీలు నిర్వహించాలని కోరుతూ తీర్మానం చేశారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి



లాంచీలో కొండకు వెళ్తున్న పర్యాటకులు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 29: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. మండలంలోని విజయపురిసౌత్ లాంచీ స్టేషన్ నుంచి పర్యాటకులు వివిధ లాంచీలలో నాగార్జున కొండకు చేరుకున్నారు. కొండపై గల మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్థూపం, బోధివృక్షంను సందర్శించారు. అనంతరం అనుపులో యాంపీ థియేటర్ అశ్వమేధ యజ్ఞశాల, రంగనాథస్వామి ఆలయం వీక్షించారు. 60 అడుగుల ఎత్తు నుంచి జాలువారే ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. పర్యాటకుల రాకతో లాంచీ స్టేషన్‌కు రూ.42 వేల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

వైసీపీ నాయకుడిపై రౌడీషీట్

బాపట్ల, సెప్టెంబరు 29: పట్టణ వైసీపీ ఎస్సీ సెల్ నాయకుడు జోగి రాజాపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సోషల్ మీడియా ద్వారా అనేక పోస్టులు పెట్టటంతోపాటు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, అంతేగాక వివిధ నేరాలకు పాల్పడినట్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఇప్పటి వరకు 7 కేసులు ఆయనపై నమోదు అయ్యాయి. తాజాగా టీడీపీ శ్రేణులను టార్గెట్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ఇబ్బంది పెడుతున్నాడంటూ టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు తదితరులు వేర్వేరుగా అతనిపై కేసులు పెట్టారు. పోలీసులు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవటంతో రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు పట్టణ సీఐ ఆర్.అహ్మద్ జానీ ఈ సందర్భంగా తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ పీఈటీ మృతి

వినుకొండ టౌన్, సెప్టెంబరు 29: డివైడర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని వెంకటేశ్వర థియేటర్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల్లో పీఈటీగా పనిచేస్తున్న మెర్ల అప్పారావు (35) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తూ వాహనం అదుపుతప్పి డివైడర్ ఢీకొని తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య మాణిక్యం ఉంది. ప్రభుత్వ పాఠశాల్లో పీఈటీగా పని చేస్తున్నారు. వీరికి బాబు, పాప సంతానం కలరు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 29: పొన్నూరు పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం యువకుడు మృతి చెందాడు. అర్బన్ పోలీసు కథనం ప్రకారం పట్టణంలోని సజ్జా కల్యాణ మండపం సమీపంలో ఈతేరు వైపు నుంచి పొన్నూరు వస్తున్న ఆటో, పొన్నూరు వైపు నుంచి చింతలపూడి వైపు వెళ్తున్న బొలారో వ్యాన్ ఢీకొన్నాయి. ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న తెనాలి మండల సంగం జాగర్లమూడికి చెందిన జిల్లపోగుల రాజేష్ బాబు (30) సంఘటనా స్థలంలోనే తీవ్రంగా గాయపడి మృతి చెందాడు, మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

తెనాలి క్రైం, సెప్టెంబరు 29: రైలు నుంచి జారిపడిన గుర్తుతెలియని వ్యక్తి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ వెంకటాద్రి ఆదివారం తెలిపారు. గత శుక్రవారం న్యూఢిల్లీ-త్రివేంద్రం కేరళ ఎక్స్‌ప్రెస్ నుంచి గుర్తుతెలియని యువకుడు తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలోని చిలువూరు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై జారి పడ్డాడు. రైల్వే సిబ్బంది 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి 35 సంవత్సరాలు ఉంటాయి. బ్లూ టీషర్ట్, గళ్ల ప్యాంట్ ధరించి ఉన్నాడు. వైద్యుల రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీచ్‌కి వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

- ఎదురెదురుగా ఢీకున్న ఆర్టీసీ బస్సు, టాటాఏస్
- ఇద్దరు మృతి, 9 మందికి గాయాలు



పెనుమూడి - పులిగడ్డ వంతెనపై ఢీకున్న ఆర్టీసీ బస్సు, టాటాఏస్

రేపల్లె, సెప్టెంబరు 29: ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, టాటాఏస్ ఢీకున్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా, తొమ్మిది మందికి తీవ్ర గాయాలైన సంఘటన పెనుమూడి - పులిగడ్డ వంతెనపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ ఏ.మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. రేపల్లె నుంచి మచిలీపట్నం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, కృష్ణా జిల్లా బందరు మంగినపూడి బీచ్ నుంచి రేపల్లె వైపు వస్తున్న టాటాఏస్ పెనుమూడి - పులిగడ్డ వారధిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రేపల్లె మండలం పెద అరవపల్లి గ్రామానికి చెందిన మాతంగి గంగాధర్ (45), అతని మేనల్లుడు శ్యామ్ (20) అక్కడికక్కడే మృతి చెందారు. టాటాఏస్‌లో ఉన్న మృతుడు గంగాధర్ భార్య లూథియా, కుమారుడు మనోజ్‌లతోపాటు రత్నకుమారి, సౌజన్య, దున్న కల్యాణ్ బాబు, దున్న శ్రావ్య, బచ్చలపూడి గురవయ్య, బచ్చలపూడి అమ్ములు, బేతపూడి రాజేష్ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించటంతో ముగ్గురిని అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు, మిగిలిన వారిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు మనోజ్, సౌజన్య, రత్నకుమారిని గుంటూరుకు తరలించారు. మృతుడు గంగాధర్ పెద్దనాన్న సంవత్సరీకాన్ని శనివారం ముగించుకుని ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా టాటాఏస్ వాహనంలో పది మంది బందరు బీచ్‌కు వెళ్లి వస్తూ ప్రమాదానికి గురైయ్యారు. ఇద్దరు మృతి చెందటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని పోలీసు సిబ్బంది పరిశీలించి క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



గంగాధర్ (ఫైల్‌ఫొటో)

నాటి త్యాగానికి.. నేడు న్యాయం!

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటికి అవకాశం
- పోటీకి టీడీపీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్



మాజీ మంత్రి ఆలపాటికి మద్దతుగా గుంటూరు కలెక్టరేట్ వద్ద పశ్చిమ ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తెనాలి, గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనసేనతో పొత్తులో భాగంగా తెనాలి అసెంబ్లీ సీటును త్యాగం చేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను శాసనమండలికి పంపాలని టీడీపీ అధిష్టానం నిర్ణయించింది. ఎన్డీఏ కూటమి పొత్తులో భాగంగా సీట్లు కోల్పోయిన నేతలకు న్యాయం చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలకనేత, ఆది నుంచి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు తగిన న్యాయం చేసేందుకు అధినేత సిద్ధమయ్యారు. ఈ నెల 30తో గుంటూరు- కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవీ కాలం ముగియనున్నది. దీంతో ఈ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఆలపాటికి చంద్రబాబు ఇచ్చారు. త్వరలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగనుండటంతో పోటీకి ఆలపాటికి అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. దీంతో ఆలపాటి అభిమానులు, టీడీపీ శ్రేణుల్లో సంతోషం వెల్లివిరిసింది. ఆలపాటికి నామినేటెడ్ పదవులపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం సాగగా, ఆ ఊహాగానాలకు తెరదింపుతూ అధిష్టానం ఆయన్ను మండలికి పంపేందుకు సిద్ధమైంది. 2019 ఎన్నికల్లో తెనాలిలో ఓడిపోయినా ఆలపాటి వెనక్కి తగ్గలేదు. 2024 వరకు నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని శ్రేణులను కాపాడుకుంటూ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళనలు చేస్తూ పార్టీని నిలబెట్టుకున్నారు. 2024 ఎన్నికల్లో ఆలపాటికి సీటు ఇవ్వకపోవడంతో ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు నిరుత్సాహం వ్యక్తం చేశారు. సీటు లభించని పరిస్థితుల్లో నిరుత్సాహపడకుండా అధిష్టానం నిర్ణయాన్ని గౌరవిస్తూ, తన క్యాడర్‌కు ధైర్యం చెబుతూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో అవకాశం లభించనున్నదనే సమాచారంతో ఆలపాటి అభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అసెంబ్లీ సీటును త్యాగం చేసిన ఆలపాటి

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం- జనసేన- బీజేపీలు ఎన్డీఏ కూటమిగా ఏర్పాటయ్యాయి. పొత్తులో భాగంగా అసెంబ్లీ సీట్లను మూడు పార్టీలు పంచుకున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెనాలి సీటు జనసేనకు వెళ్లింది. జనసేనలో కీలకనేత, పీఏసీ చైర్మన్ అయిన మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ తెనాలి నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఆలపాటి రాజా తెనాలి సీటును త్యాగం చేయాల్సి వచ్చింది. అయితే గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేస్తారన్న ఊహాగానాలు అప్పట్లో వెలువడ్డాయి. కానీ సామాజిక సమీకరణాలు కలసి రాకపోవడంతో ఆయన అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. పొత్తులో సీటు కోల్పోయినా తెనాలి నుంచి పోటీ చేసిన జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ గెలుపులో కీలకంగా వ్యవహరించారు. విద్యార్థి దశ నుంచి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న ఆలపాటి, కీలక సమయంలో త్యాగానికి సిద్ధపడడంతో అధిష్టానం ఆయన త్యాగాన్ని గుర్తించింది. ఎన్నికల ప్రచార సమయంలో అధినేత హామీ ఇచ్చినట్లు ఆలపాటికి ప్రస్తుతం ఎమ్మెల్సీ బరిలో పోటీ చేసే అవకాశం కల్పించింది. 2024 ఎన్నికల్లో తెనాలి నుంచి పోటీకి సిద్ధమైనా అధిష్టానం ఆదేశాలతో తప్పుకున్న ఆయనకు ప్రస్తుతం పెద్దల సభకు వెళ్లే అవకాశం దక్కింది.

నేడు ఏఎన్‌యూకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



పెదకాకాని, సెప్టెంబరు 29: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు నేడు (సోమవారం) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి రానున్నారు. తత్వవేత్త కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి ఉత్సవాల సందర్భంగా 'పద్మవిభూషణ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి విజన్ అండ్ ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్ రిఫ్లెక్షన్స్ ఆన్ 21వ సెంచరీ ఎడ్యుకేషనల్ పాలసీ అండ్ ప్లానింగ్ ఇన్ ఇండియా' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సును ప్రారంభించనున్నారు. ఉదయం 10.30 గంటలకు వర్సిటీలోని డైక్ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు అధ్యక్షత వహించనున్నారు. సదస్సుకు వెంకయ్య నాయుడుతోపాటు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, యూపీఎస్సీ పూర్వ సభ్యులు ప్రొఫెసర్ కె.ఎస్.చలం హాజరవుతారని అన్నారు . ఈ సదస్సులో ఢిల్లీ యూనివర్సిటీ ఫిలాసఫీ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ అశోక్ వోహ్రా కీలకోపన్యాసం చేయనున్నారు.

జాతీయ సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి ..

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు నిర్వహణకు వర్సిటీ ముస్తాబైయింది. వర్సిటీ అధికారులు వర్సిటీ ముస్తాబు చేసి సర్వం సిద్ధం చేశారు. ప్రధాన వేదికపై అతిథుల కోసం ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిలు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారు. సదస్సును విజయవంతం చేసేందుకు ఉపకులపతి ఆచార్య గంగాధరరావు ఎనిమిది కమిటీలను నియమించారు. ఆదివారం వర్సిటీ లోని ఆడిటోరియాన్ని వీసీ గంగాధర్‌రావు, రిజిస్ట్రార్ సింహాచలం, సదస్సు కన్వీనర్ త్రిమూర్తిరావు, కమిటీ కన్వీనర్లు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పరిశీలించారు.

సమగ్ర అవగాహనకు ఉపకరించే శిక్షణ

- జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి బసు



జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, డీఎల్‌డీవో శిక్షణ తరగతుల్లో చార్ట్ ద్వారా వివరిస్తున్న రిసోర్స్ పర్సన్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 29 : గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ శాఖా పరమైన అంశాల సమగ్ర అవగాహనకు శిక్షణా తరగతులు దోహద పడతాయని జడ్పీ సీఈవో వి. జ్యోతిబసు అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన మూడు రోజుల ముగింపు శిక్షణా తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణ తరగతులలో రిసోర్స్ పర్సన్ బొంతా సుబ్బారావు మాట్లాడుతూ పంచాయతీ ఆస్తుల పరిరక్షణ, నిబంధనలపై అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో ఎదుర్కొనే న్యాయ పరమైన అంశాలను ప్రస్తావించారు. పి.నాగానంత్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వీధి దీపాల నిర్వహణ అందరికీ అవగాహన కల్పించారు. దీంతో శిక్షణ కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ, జిల్లా శిక్షణ మేనేజర్ కంచర్ల నాగేశ్వరరావు, జిల్లా రిసోర్స్ పర్సన్స్ నిరంజన్‌రావు, కరిముద్దీన్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మత కలహాలు రాకూడదనే పవన్ కల్యాణ్ దీక్ష



హోమంలో గాదె వెంకటేశ్వరరావు, చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 29: తిరుమల శ్రీవారి దివ్య ప్రసాదానికి అపచారం జరిగిందని విషయం తెలియగానే భక్తుల మనోభావాలు దెబ్బతినకూడదని, మత కలహాలు రాకుండా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా ఆదివారం మంగళగిరి ఘాట్ రోడ్డులోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శాంతి హోమం నిర్వహించారు. జనసేన మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ శుద్ధి, విష్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, అగ్ని ప్రతిష్ఠ, కలశ ఆరాధన, శాంతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా గాదె, చిల్లపల్లి మాట్లాడుతూ భారతదేశంలో గొప్పదైన సనాతన ధర్మాన్ని ఒక మతానికి ఆపాదించి వికృత చేష్టలకు ఒడిగడుతున్నారని విమర్శించారు. జనసేన పార్టీ ఏనాడూ కులాల్ని వెనకేసుకు రాలేదని, అలాంటి వ్యక్తి దీక్ష చేస్తుంటే విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఏ మతానికి అపచారం జరిగినా పవన్ ముందుండి నిలదీస్తారని స్పష్టం చేశారు. జనసేన పార్టీ జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

ఎక్సైజ్ శాఖలో భారీగా సీఐల బదిలీలు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 29: ఎక్సైజ్ శాఖలో సీఐల బదిలీలు భారీగా జరిగాయి. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో బదిలీ అయిన సీఐల వివరాలు ఇలా ఉన్నాయి.

గుంటూరు జిల్లాలో.. బి.లత గుంటూరు-1కు, వై.యశోదరా దేవి గుంటూరుకు, వై. అశోక్ కుమార్ ప్రత్తిపాడుకు, జి.వీరాంజనేయులు మంగళగిరికి, ఏవీ.చలం తెనాలికి, ఏం. రమేష్ పొన్నూరుకు బదిలీ అయ్యారు.

బాపట్ల జిల్లాలో.. పి.గీతిక బాపట్లకు, ఆర్ దివాకర్ రేపల్లెకు, ఏ.రవి వేమూరుకు, ఎం.శ్రీరాం ప్రసాద్ నగరంకు, పి.నాగేశ్వరరావు చీరాలకు, ఎం.భుజంగరావు పర్చూరుకు, ఏ.భవాని అద్దంకి బదిలీ అయ్యారు.

పల్నాడు జిల్లాలో.. కె.సోమయ్య నరసరావుపేటకు, కొడాలి విజయ్ కుమార్ చిలకలూరిపేటకు, పి. విజయ్ కుమార్ సత్తెనపల్లికి, టి.తులసి క్రోసూరుకు, కె.కర్ణ పిడుగురాళ్లకు, కె.బుజ్జి బాబు గురజాలకు, ఎస్.వెంకటరమణ మాచర్లకు, డి.వెంకటేశ్వర్లు ఈపూరుకు, వి. శ్రీనివాసులు పెదకూరపాడుకు బదిలీ అయ్యారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

వరద బాధితులకు చేయూత



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చెక్కును అందజేస్తున్న పీ.కృష్ణ సూర్యకుమార్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 29: వరద బాధితులకు విరాళం నిమిత్తం విశ్రాంత ప్రైవేటు ఉద్యోగి పూసపాటి కృష్ణ సూర్యకుమార్ వాట్సప్ గ్రూపు ద్వారా సేక రించిన లక్ష రూపాయలను ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశారు. అనంతరం కృష్ణ సూర్యకుమార్ మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం 'తెలుగు కావ్య మదనం' అనే వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేసిన ఆయన, తెలుగు పద్య రచనపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 501 మందికి శిక్షణ ఇచ్చానని ఇందులో కొంత మంది విదేశీ విద్యార్థులు కూడా ఉన్నారని అన్నారు. ఈ మధ్యనే రాష్ట్రానికి వచ్చిన విపత్తు గురించి తమ గ్రూపు సభ్యులకు తెలియజేయగా వారందరూ కలసి ఈ విరాళాన్ని సేకరించారని అన్నారు.



వంట సామగ్రి వాహనానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న లక్ష్మణరెడ్డి తదితరులు

రాయపూడి లంక బాధితులకు 'మానవత' వంట సామగ్రి

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 29: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.425 కోట్లు విరాళాలుగా అందించడం ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి, దాతల మానవత్వానికి ప్రతీక అని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన సలహాదారులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గుంటూరులోని 'మానవత' సంస్థ ఆధ్వర్యంలో లక్ష రూపాయల విలువ చేసే వంట సామగ్రిని రాయపూడి లంకగ్రామ వరద బాధితులకు అందించే వాహనాన్ని లక్ష్మణరెడ్డి, మానవత సంస్థ ప్రెసిడెంట్ కొమ్మాల పాటి శ్రీనివాసరావులు జెండా ఊపి ప్రారంభించారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ 'మానవత' రాష్ట్ర వ్యాప్తంగా 115 శాఖల ద్వారా 70 వేల మంది సభ్యులు రూ.15 లక్షల విరాళాలను సేకరించి వరద బాధితులకు బహుముఖ సేవలందించడం అభినందనీయమన్నారు. 'మానవత' చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ వరదల సందర్భంగా నష్టపోయిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.5 లక్షల విలువ చేసే నోట్ పుస్తకాలను అందిస్తామని ప్రకటించారు. అనంతరం సంస్థ ప్రెసిడెంట్ కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి కె. సతీష్ మాట్లాడారు. వంట సామాగ్రిని దానం చేసిన పలు కుటుంబాల గృహిణులను అభినందించారు. కార్యక్రమంలో 'మానవత' నిర్వాహకులు ఆర్.సత్యనారాయణ, సీహెచ్ శివాజీ, యూ.సాంబశివరావు, బీఎస్ మిత్ర, ఎస్. సాంబశివరావు, టీ.ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

లలితా హాస్పిటల్స్‌లో గుండె జబ్బుల ఉచిత వైద్యశిబిరం



మాట్లాడుతున్న కార్డియాలజిస్ట్ డాక్టర్ అనురాగ్

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 29: వరల్డ్ హార్ట్ డే పురస్కరించుకొని స్థానిక కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ప్రాంగణంలో ఆదివారం గుండె జబ్బుల ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కరోనరీ ఆర్టరీ వ్యాధులు, గుండె కవాట వ్యాధులు, హార్ట్ ఫెయిల్యూర్, పెరిఫెరల్ వ్యాస్క్యులర్ వ్యాధులతో సహా అన్ని రకాల హృదయ సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబి రంలో రోగులకు రక్తపోటు, షుగర్, ఈసీజీ, ఎకో కార్డియోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా కార్డియాలజీ కన్సల్టేషన్ నిర్వహించారు. 300 మంది రోగులు ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం కార్డియాలజిస్ట్ డాక్టర్ పీ.అనురాగ్ ఆధ్వ ర్యంలో ప్రజా అవగాహన సదస్సు నిర్వహించారు. గుండె జబ్బులపై ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. ప్రపంచవ్యాప్తంగా గుండె ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం పంపేందుకు సంతకాల సేకరణ జరిపారు. ప్రపంచ హృదయ దినోత్సవ ప్రచారంలో భాగంగా ప్రజలు గుండెను రక్షించుకోవాలి అనే ఆలోచన కల్పించడానికి ఆసుపత్రి భవనంపై ఎర్రలైట్లు ఏర్పాటు చేశారు. కార్య క్రమంలో డాక్టర్ అనురాగ్, డాక్టర్ ఫణి, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ మారుతీ, డాక్టర్ సంగ్రామ్ సింగ్, డాక్టర్ ఫణిరాజ్, డాక్టర్ ఇందు, డాక్టర్ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

హృదయాన్ని పదిలంగా కాపాడుకోవాలి

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హృదయం అద్దం లాంటిదని, దాన్ని పదిలంగా కాపాడుకోవాలని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. 'ప్రపంచ హృదయ దినోత్సవం' సందర్భంగా కారుమూరి హాస్పిటల్‌లో జరిగిన వైద్య శిబిరం, అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతిరోజూ వ్యాయామం, సమతుల్య ఆహారం తీసుకోవడం, దురలవాట్లకు దూరంగా ఉండడం వంటి నియమాల ద్వారా గుండెను కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ చిలక వెంకటేశ్వర్లు, సలామ్ పాల్గొన్నారు.

రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలి

● సంఘ జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి



మాట్లాడుతున్న కొల్లి రంగారెడ్డి, పక్కన రైతు సంఘం నాయకులు

గుంటూరు(తూర్పు),సెప్టెంబరు 29: ఇటీ వల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పంట నష్ట పోయిన ప్రతి రైతు, కౌలు రైతుకు తక్షణమే నష్ట పరిహారం ఇవ్వాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి అన్నారు. ఆదివారం కొత్తపేటలోని స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో వరి, 60 వేల ఎకరాల్లో మొక్కజొన్న, మినుము, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయని అన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తా మని చెప్పిన పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర మాదిరిగానే ప్రత్తిపాడు, తెనాలి, తాడికొండ ఎమ్మెల్యేలు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఎకరాకు నష్ట పరి హారం అందేలా స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు కృషి చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో కే.విఠల్‌రెడ్డి, ఎం.శివశంకర్ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

● ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్



పట్టభద్రుల ఓటరు నమోదు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రెండు జిల్లాల్లోని పట్ట భద్రులంతా ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ పిలుపు నిచ్చారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఆయన ఉమ్మడి కృష్ణ- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ నమోదు పోస్టర్‌ను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సిటిజన్ రైట్స్ ఫోరం అధ్యక్షుడు షేక్ జిలాని నేతృత్వంలో జరుగుతున్న ఈ- ఓటర్ నమోదు కార్యక్రమంలో పట్టభద్రులైన యువత పాల్గొని నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో దగా పడిన నిరుద్యోగ యువత కోసం ఉద్యోగాలు రావాలన్నా, ఉపాధి కల్పన జరగాలన్నా, కృష్ణ,గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం కూటమి అభ్యర్థి విజయం ఎంతో కీలకమైందని చెప్పారు. రాబోయే తరాలు, నేటి యువత హక్కుల సాధన, రాజధాని అభివృద్ధి, ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం పట్టభద్రులు ఎన్నికల్లో పాల్గొనాలని అన్నారు. ఫోరం అధ్యక్షుడు సెప్టెంబరు 30 నుంచి నవంబర్ 6 వరకు జరిగే ఈ కార్యక్రమంలో పట్టభద్రులంతా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భారతి, టీడీపీ నాయకులు జీ.ప్రభాకర్, ఎం.నరసింహారావు, దయారత్నం, బాబురావు, రత్నం పాల్గొన్నారు.

ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ నేటి నుంచే..

● అందుబాటులోకి రానున్న శాండ్ పోర్టల్
● పేర్లు నమోదు తర్వాతే బుకింగ్‌కు అనుమతి
● సొంత వాహనం లేకుంటే రవాణ ఛార్జీలు : కలెక్టర్

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవడానికి వెబ్ పోర్టల్ అందుబాటులోకి రానుంది. సాంకేతిక సమస్యలను అధిగమించి సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా వినియోగదారుల కోసం తీసుకున్నట్లు అధికార యంత్రాంగం ప్రకటించింది. సొంత అవసరాల కోసం ఎవరికైతే ఇసుక కావాలో వారు వెబ్ అడ్రస్‌లోకి వెళ్లి ఎస్ఏఎన్‌డీ.ఏపీ.జీవోవీ.ఐఎన్ అని ఆంగ్ల అక్షరాలు నమోదు చేయగానే పోర్టల్ తెరుచుకుంటుంది. ఆ పోర్టల్‌లో రిజిష్టర్ చేసుకొని నగదు చెల్లిసే వారికి ఇసుక సరఫరా జరుగుతుంది. సొంత వాహనం కలిగిన వారికి ఇసుక స్లాట్ ఇస్తారు. ఆ స్లాట్‌లో వాహనం తీసుకొని వెళ్లి ఇసుక తెచ్చుకోవచ్చు. సొంత వాహనం లేని వారికి ప్రభుత్వమే వాహనం సమకూర్చి ఇసుక సరఫరా చేస్తుంది. ఇందుకు అయ్యే రవాణ ఛార్జీలు వినియోగదారుడు చెల్లించిన తర్వాతనే స్టాక్‌యార్డు నుంచి ఇసుక వాహనం బయలు దేరుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు.

తాళ్లాయపాలెం నుంచే..

ఇసుక నూతన విధానాన్ని ఈ నెల 11వ తేదీనే రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. అయితే వెబ్ పోర్టల్ రూపకల్పనలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం అయ్యాయి. దీంతో కొత్తగా ఇసుక బుకింగ్స్‌కు అనుమతించకుండా గత నెలలో వరదలకు ముందు బుకింగ్ చేసుకున్న వారికే నిన్నమొన్నటి వరకు సరఫరా చేస్తూ వచ్చారు. జిల్లాలో ప్రస్తుతం తాళ్లాయపాలెం ఇసుక స్టాక్‌యార్డు మాత్రమే అందుబాటులో ఉంది. లింగాయపాలెం స్టాక్‌యార్డులోకి వరదనీరు చేరిపోవడం వలన అక్కడికి వాహనాలు వెళ్లలేని పరిస్థితి. జిల్లాలో మరికొన్ని చోట్ల ఇసుక రీచ్‌లు గుర్తించినప్పటికీ వాటిల్లో తవ్వకాలకు ఇంకా పర్యావరణ అనుమతులు రాలేదు. దీంతో సోమవారం నుంచి ప్రారంభయ్యే ఆన్‌లైన్ బుకింగ్స్‌కు కూడా ఇసుకను తాళ్లాయపాలెం నుంచే సరఫరా చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది.

రవాణ ఛార్జీలు భారం అయ్యే అవకాశం

జిల్లాలో ప్రస్తుతం ఒక స్టాక్‌యార్డు మాత్రమే అందుబాటులో ఉన్నందున పొన్నూరు, ప్రత్తిపాడు, తెనాలి నియోజకవర్గాలకు ఇసుక రవాణ చేయడం భారంగా మారే పరిస్థితులు ఏర్పడ్డాయి. తాళ్లాయపాలెం ఇసుక స్టాక్‌యార్డు నుంచి గుంటూరు నగరం దాదాపుగా 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే పొన్నూరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలు ఈ స్టాక్‌యార్డుకు 70 కి.మీ దూరంలో ఉంటాయి. అలానే పెదనందిపాడు, కాకుమాను మండలాలు కూడా ఇంచుమించు ఇంతే దూరంలో ఉంటాయి. ఈ నేపథ్యంలో రవాణ ఛార్జీలు కచ్చితంగా భారంగా పరిణ మిస్తాయి. సాధ్యమైనంత త్వరగా దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో ఇసుక తవ్వకాలకు ఈసీ అనుమతులు తీసుకుంటే రవాణ ఖర్చులు వినియోగదారులకు తగ్గుతాయి.

నేటి నుంచి అక్టోబరు 4 వరకు
వరద నష్టాలకు సంబంధించి ప్రత్యేక ఫిర్యాదుల కౌంటర్లు

గుంటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలు, భారీ వర దల వలన నష్టపోయిన వారికి ఎన్యూ మరేషన్ చేసి నష్టపరిహారం కోసం సిఫార్సు చేసినట్లు కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నష్ట పరిహారం ఈ నెల 25 నుంచి బాధితుల బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం ప్రారం భించిందని, చాలా మందికి ఇప్పటికే నగదు జమ చేసినట్లు తెలిపారు. ఎవరికైనా నష్టపరిహారం అందకపోయినా, ఎన్యూమరేషన్‌పై సందేహాలు, ఫిర్యా దులు ఉన్నా ఈ నెల 30 నుంచి అక్టోబర్ 4 వరకు ప్రత్యేక ఫిర్యాదుల కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్ల తెలి పారు. గుంటూరు కలెక్టరేట్, తెనాలి సబ్ కలెక్టర్, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధి కారి, తహసీల్దార్ కార్యాలయాలో ఎక్కడైనా ఫిర్యాదు నమోదు చేస్తే, వాటిని పరి శీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వీధి కుక్కలకు ప్రతిరోజూ 100 ఏబీసీ సర్జరీలు చేయాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు



వీధి కుక్కల సర్జరీ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 29: ప్రతిరోజూ వందకు తగ్గకుండా వీధి కుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సర్జరీలు చేసేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన చర్యలు సదరు కాంట్రాక్ట్ సంస్థ చేపట్టాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం ఏటుకూరు రోడ్డులోని ఏబీసీ సెంటర్, వర్మీ కంపోస్ట్ యూనిట్, వెంగళాయపాలెంలోని గోశాలను ఆయన సందర్శించారు. ఆయా చోట్ల తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. తొలుత ఏబీసీ సెంటర్‌లోని ఆపరేషన్ థియేటర్‌ను, ఆపరేషన్ అనంతరం కుక్కలను ఉంచుతున్న ప్రాంతాలను, వాటికి అందిస్తున్న ఆహా రం, చికిత్స విధానాలను అక్కడి పశు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఇక్కడికి తీసుకొచ్చే వీధికుక్కలు, ఆపరేషన్ చేసిన కుక్కల వివరాలను రిజిస్టర్‌లో పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లా డుతూ నగరంలో వీధికుక్కలను నియంత్రించాలని కోరుతూ ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నట్లు చెప్పారు. ఏటుకూరు రోడ్డులోని ఏబీసీ సెంటర్‌లోని స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తుందన్నారు. ప్రతిరోజు 100 కుక్కలకు ఆపరేషన్లు జరిగేలే ఏజన్సీ తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, అందుకు తగిన మౌలిక వసతులను జీఎంసీ కల్పిస్తుందన్నారు. ఆపరేషన్ జరిగిన కుక్కలకు నిర్దేశిత సమయం వరకు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని, తగిన చికిత్స, ఆహారం అందించాలన్నారు. ఏబీసీ సెంటర్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఏ వీధిలో నుండి తీసుకొచ్చిన కుక్కలను ఆపరేషన్ అనంతరం అదే వీధిలో విడిచి పెట్టాలన్నారు. అనంతరం వర్మీ కంపోస్ట్ యూనిట్‌ని పరిశీలించారు. నగరంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్ ప్రాజెక్ట్‌కు తరలించాలన్నారు. అనంతరం వెంగళాయపాలెంలోని గోశాలను పరిశీలించి, ఎన్ని ఆవులు ఉన్నాయో, వాటికి అందిస్తున్న ఆహార వివరాను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు బురదగా ఉండడం గమనించిన కమిషనర్, ప్రాంగణంలో ఫ్లోరింగ్ చేసేందుకు , నూతన షెడ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిటీ ప్లానర్ డి.రాంబాబు, ఈఈలు సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, ఎంహెచ్‌ఓలు మధుసూదన్, ఆనందకుమార్, రాంబాబు, డీఈఈ సతీష్, ఏసీపీ మురళి, టీపీఎస్ సువర్ణ కుమార్, ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దాసరి ఏడుకొండలు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

సృజనాత్మక నైపుణ్యాలు వెలికితీసేందుకే కథల పోటీలు

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 29: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసేందుకే కథల పోటీలు నిర్వహిస్తున్నా మని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఏసీ కళాశాలలో నిర్వహించిన కథల పోటీలు నిర్వ హిం చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో లక్ష్మణరావు మాట్లా డుతూ ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో భాషా పరిజ్ఞానం మరింత పెరుగుతుందన్నారు. ప్రజాగాయకులు పీవీ రమణ మాట్లా డుతూ బాల్యంలో ఆట, పాటలకు దూరమౌతున్న నేపథ్యంలో ఇటువంటి పోటీలు నూతన ఉత్సాహమిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.మోజేస్, బాల సాహిత్యవేత్తలు హకీమ్ జానీ, ఎస్ఎం సుభాని, జేవీవీ నాయకులు బీ.ప్రసాద్, జాన్ బాబు, జీ.వెంకట రావు, శంకర్‌సింగ్, ఆర్.స్వాతి, ఈ.రాధ, టీఆర్ రమేష్ పాల్గొన్నారు.

రౌడీ షీటర్లూ.. రాత్రి 8 తర్వాత బయటకనిపించొద్దు

● కుటుంబ సభ్యుల సమక్షంలో ఎస్పీ కౌన్సెలింగ్

గుంటూరు, సెప్టెంబరు 29 : నగరంలో నివాసం ఉంటున్న రౌడీషీటర్లు రాత్రి 8 గంటల తరువాత బయట కనిపిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఈస్ట్, వెస్ట్ సబ్ డివిజన్‌ల పరిధిలోని రౌడీ షీటర్లకు, వారి కుటుంబసభ్యుల సమక్షంలో ఆదివారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కౌన్సెలింగ్‌కు ఈస్ట్, వెస్ట్ సబ్ డివిజన్‌ల పరిధిలో సుమారు 500 మంది రౌడీ షీటర్లు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పుకు వారి కుటుంబసభ్యులు కూడా తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. వారికి ఉన్న చెడు అలవాట్లకు దూరం చేసే విధానాన్ని వివరించారు. ఏ ఒక్క రౌడీ షీటర్ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడొద్దని, ఒకవేళ పట్టుబడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లు, పాత కేసులో ఉన్న నిందితుల ప్రవర్తనపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, వెస్ట్ డీఎస్పీ జయరామ్ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్య, లాలాపేట సీఐ శివప్రసాద్, కొత్తపేట సీఐ వీరయ్య, పాతగుంటూరు పోలీస్ స్టేషన్ సీఐ సోమయ్య, అరండల్‌పేట సీఐ శ్రీనివాసరావు, నగరంపాలెం సిఐ మధుసూదన్ రావు, పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

తొలిసారి నూతన విధానానికి శ్రీకారం చుట్టిన ఎస్పీ

జిల్లా ఎస్పీ మారినప్పుడల్లా తమదైన శైలిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తుంటారు. ప్రత్యేకత కలిగిన ఎస్పీలు అయితే డాక్యుమెంటరీ కౌన్సెలింగ్ కూడా నిర్వహించేవారు. కొన్ని నెలల క్రితం జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సతీష్‌కుమార్.. రౌడీ షీటర్లలో మార్పుకు నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. గతానికి భిన్నంగా రౌడీ షీటర్ల కుటుంబ సభ్యులకు కూడా కౌన్సెలింగ్ ఇచ్చారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

గుంటూరు, సెప్టెంబరు 29: డిపో పరిధిలోని సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ గుంటూరు-2 డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ షేక్ అబ్దుల్‌సలాం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు-హైదరాబాద్ , గుంటూరు- తెనాలి, గుంటూరు-విజయవాడ, గుంటూరు-విశాఖపట్నం రూట్లలో తిరుగుతున్న బస్సులు, సిబ్బంది పని తీరుపై ప్రయాణీకులు, విద్యార్థులు 9959225421 నంబర్‌కు ఫోన్ చేసి తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.



సినీ గీతాలను ఆలపిస్తున్న గాయకులు

అలరించిన సినీ సౌరభాలు

గుంటూరు(తూర్పు), సెప్టెం బరు 29: స్థానిక బృం దావన్‌గార్డెన్స్‌లోని వేంక టేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం సినీ సౌర భాలు కార్యక్రమం జరిగింది. మహతి స్వరసుధ వ్యవ స్థాపక అధ్యక్షురాలు పత్రి నిర్మల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంజరిగింది. కృష్ణప్రసాద్ వ్యాఖ్యానంతో కే.మదన్‌మోహనరావు నిర్వహించారు. ఆలయ పాలకమండలి సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీగాయకులు రాజ్యలక్ష్మి, అన్న పూర్ణ, ముకుందప్రియ, లక్ష్మి, కృష్ణ, నాగవల్లి, విజయశ్రీ, ప్రద్యుమ్న, వీరయ్య, సాయి బాబా, ఈశ్వరరావు, వేణుగోపాలరావు, వీర రాఘవ, కృష్ణప్రసాద్, రాజ శేఖర్ ఆలపిం చారు. కీబోర్డు ప్రసాద్, తబలా వెంకట్, పాడ్స్ ప్రసాద్ వాయిద్య సహకారం అందిచారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, సెప్టెంబరు 29 : స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటుకూరు రోడ్డు దర్గా మాన్యంకు చెందిన ఉయ్యాల నాగేశ్వరరావు(33), ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నాగేశ్వరరావు కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తుంటాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. నాగేశ్వరరావు కొంత కాలంగా మద్యానికి బానిసకావడం, భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా వారు విడిగా ఉంటున్నారు. సుమారు ఐదేళ్ల క్రితం భార్య ఉయ్యాల తిరుపతమ్మ కూతురును తీసుకుని కొల్లిపరలోని తన పుట్టింటికి వెళ్ళింది. నాగేశ్వరరావు దర్గా మాన్యంలో తన తల్లి, చెల్లి వద్ద ఉంటున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని నాగేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న అతని చెల్లెలు.. మృతుడి భార్య తిరుపతమ్మకు ఫోన్ చేసి చెప్పింది. తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

● జేఏసీ కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్

గుంటూరు(విద్య),సెప్టెంబరు 29: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు చేస్తానని జేఏసీ కార్యదర్శి యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, డీఏ, ఇతర పెండింగ్ బకాయిల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. మున్సి పల్ టీచర్ల ప్రమోషన్లు, బదిలీలు, పీఎఫ్ సాధన కోసం, పోస్టుల అప్ గ్రేడేషన్ కోసం యూటీఎఫ్ తరపున నాలుగు దశల్లో పోరాటం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు బీ.ఆదిలక్ష్మీ, ఎం.కళాధర్, ప్రచురణల విభాగం ప్రతినిధి ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షులు వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి దౌలా పాల్గొన్నారు.

పోస్టింగ్‌లు సరే...కార్యాలయాలు ఎక్కడ?

● తలలు పట్టుకుంటోన్న విద్యుత్ ఉద్యోగులు
● నేటికీ విడుదల కానీ మార్గదర్శకాలు
● అస్తవ్యస్తంగా కొత్త సర్కిల్స్ విభజన ప్రక్రియ

గుంటూరు, సెప్టెంబరు 29: సాధారణ బదిలీల్లో భాగంగా విద్యుత్‌శాఖలో కొత్త సర్కిల్స్‌కు బదిలీ చేసిన ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉద్యోగుల బదిలీలు సరే, కార్యాలయాలు ఎక్కడ, విధులు నిర్వహించాలనే దానిపై ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. సర్కిల్స్ విభజన ప్రక్రియ తలపెట్టిన అధికార యంత్రాంగం ఆ మేరకు కార్యాలయాలు ఎక్కడ, ఉద్యోగస్తులు ఎక్కడ విధులు నిర్వహించాలనే దానిపై స్పష్టత కరువైంది. మార్గదర్శకాలు విడుదల చేస్తామన్న ఉన్నతాధికారుల నుంచి నేటికీ ఆ ఊసే లేకపోవడంతో మరింత గందరగోళంగా మారింది. సర్కిల్స్ పునర్విభజన ప్రక్రియలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాను గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌గా విభజన చేసిన విషయం తెలిసిందే. నరసరావుపేట కేంద్రంగా ఏర్పాటు చేసిన పల్నాడు సర్కిల్‌లో నరసరావుపేట, మాచర్ల డివిజన్‌లు ఏర్పాటు చేశారు. అలాగే, బాపట్ల కేంద్రంగా ఏర్పాటైన బాపట్ల సర్కిల్‌లో బాపట్ల, చీరాల, అద్దంకి డివిజన్‌లు ఉన్నాయి. ఆయా సర్కిల్ కార్యాలయాలకు ఇప్పటికే పోస్టింగ్‌లు కల్పిస్తూ ఉద్యోగస్తులకు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర సర్కిల్ కార్యాలయాలకు బదిలీ అయిన ఉద్యోగస్తులు ఇప్పటికే వారికి కేటాయించిన స్థానాల్లో చేరారు. కొత్త సర్కిల్స్ కార్యాలయాలకు కేటాయించిన ఉద్యోగులు తమ మాతృస్థానాల నుంచి రిలీవ్ అయి వెళ్లాలంటేనే ఎక్కడకు వెళ్లాలనే దానిపై తర్జన భర్జన పడుతున్నారు.

అంతా అయోమయమే

కొత్త సర్కిల్ కార్యాలయాలు ఎక్కడ, ఎక్కడ విధులు నిర్వహించాలనేదానిపై స్పష్టత లేకపోవటం, ఇందు కోసం నేటికీ మార్గదర్శకాలు విడుదల కాకపోవడంపై అధికారులు, ఉద్యోగుల్లో అయోమయం నెలకొంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతి పరిధిలో సీఆర్‌డీఏ సర్కిల్ ఏర్పాటు ప్రక్రియ అంతా పద్ధతి ప్రకారం జరిగిందని, ఆ శాఖ అధికారులు గుర్తుచేస్తున్నారు. సర్కిల్‌కు ముందుగా ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)ని కేటాయించడంతో పాటు కార్యాలయాలను ఏర్పాటు చేశారు. తరువాత క్రమంగా కార్యాలయంలో సెక్షన్‌లు, సిబ్బందిని కేటాయిస్తూ సేవలను విస్తరించారు. ఇలా కొత్త సర్కిల్ కార్యాలయాలకు కూడా కార్యాలయాలు ఏర్పాటు చేయకపోవడం, నేటికీ ఆపరేషన్ ఎస్ఈల నియామకం, అకౌంట్స్ విభాగానికి గజిటెడ్ అధికారుల ఏర్పాటు ప్రక్రియ చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నెల రోజులు పైనే....

కొత్త కార్యాలయాలు ఏర్పాటు, అందులో ఆన్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు వంటి సౌకర్యాలు కల్పించాలంటే కనీసం నెల రోజుల పైనే పడుతోంది. ఈ ప్రక్రియను నేటికీ చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెలా, రెండు నెలల పాటు ఉద్యోగులు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పునర్విభజన ప్రక్రియ కోసం ఉన్నతాధికారులు కనీసం ఉద్యోగ సంఘాల నాయకులు, అధికారుల నుంచి ఎటువంటి సలహాలు, సూచనలు తీసుకున్న దాఖలాలు లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు కొందరు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆ శాఖ అధికారులు, ఉద్యోగులే గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు సీపీడీసీఎల్ పరిధిలోని కొత్త సర్కిల్స్ ఏర్పాటు ప్రక్రియలోని లోపభూయిష్ట విధానాలపై దృష్టి పెట్టి సమస్య పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

దిక్సూచి DIKSUCHI

డిజిటల్ భారత్ నిధి

నేటి ఆధునిక సాంకేతిక యుగంలో సమాచారమే ఇంధనం. అన్ని రంగాల్లో తారతమ్యాలు ఉన్నట్లే, సమాచార ప్రసారంలో కూడా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఉన్నంత సమాచార వ్యాప్తి మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో ఉండటం లేదు. కారణంగా సమాచార సమ్మిళితత్వం కొరవడి విద్య, ఆర్థిక, సాంకేతికపరమైన అంతరాలు ఇంకా విస్తరిస్తున్నాయి. 'వన్ నేషన్ - వన్ మార్కెట్', 'ఈ-నామ్' వంటి ప్రభుత్వ సమ్మిళితాభివృద్ధి చర్యలు మారుమూల ప్రాంత రైతులు, చేతివృత్తుల వారు, వ్యాపారుల వరకూ చేరలేకపోతున్నాయి.

దీనికి కారణం ప్రైవేటు టెలికం ఆపరేటర్లకు పట్టణాల్లో ఉత్పన్నమయ్యే ఆదాయం గ్రామీణ ప్రాంతాల నుంచి లభించకపోవడం. జనసాంద్రత తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో పట్టణాలతో పోలిస్తే నిర్వహణ వ్యయాలు అధికంగా ఉండటం. అయితే, ప్రైవేటురంగం వెనకడుగు వేసిన సమయాల్లో ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం ముందడుగు వేయాల్సి ఉంటుంది. ఈ నిమిత్తం బీఎస్ఎన్ఎల్ ఒక ప్రత్యామ్నాయంగా కొనసాగినప్పటికీ నిధులు, నిర్వహణాపరమైన సమస్యలతో కూనరిల్లుతోంది. ఈ నేపథ్యంలో సంస్థాగత మార్పుల ఆవశ్యకత ఏర్పడింది. దీంతో ప్రభుత్వం 'డిజిటల్ ఇండియా' ప్రణాళికలో భాగంగా 1885 నాటి 'ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టాన్ని' రద్దుచేసి, 2023లో 'టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్'ను తీసుకువచ్చింది. టెలికాం రంగంలో పెట్టుబడులను విస్తరించడానికి, మారుమూల ప్రాంతాలకు కూడా టెలికం సేవలు విస్తరించి సమ్మిళిత సమాచార వ్యవస్థను రూపొందించడానికి టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్-2023లో 'డిజిటల్ భారత్ నిధి' ఏర్పాటును అంతర్భాగం చేశారు.

అయితే టెలికం రంగంలో ఇప్పటికే మారుమూల ప్రాంతాలకు సేవలను విస్తరించేందుకు నిధుల సమీకరణ నిమిత్తం 2003లో ఏర్పాటు చేసిన 'యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్(యూఎస్ఓఎఫ్)' స్థానంలో ఈ డిజిటల్ భారత్ నిధిని తీసుకువచ్చారు.

యూఎస్ఓఎఫ్ రద్దుకు కారణాలు

ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్‌కు సవరణలు చేసి 2003లో ఈ 'యూఎస్ఓఎఫ్' నిధిని మారుమూల ప్రాంతాలకు టెలికాం సేవలు విస్తరించేందుకు పెట్టుబడులు జమ చేసే ప్రత్యేక నిధిగా రూపొందించారు.

టెలికాం ఆపరేటర్ల అడ్జెస్టెడ్ గ్రాస్ రెవెన్యూ(ఏజీఆర్-సవరించిన స్థూల ఆదాయం)పై 5 శాతం లెవీ విధించడం ద్వారా ఈ నిధికి వనరులు సమకూరేవి. అయితే ఈ నిధిని స్థాపించిన నాటినుంచి వనరుల అసమర్థ వినియోగం గురించిన విమర్శలను ఎదుర్కొంటూనే ఉంది.

2017-22 మధ్యకాలం చూసుకుంటే ఈ నిధికి రూ.41,740 కోట్లు జమ అవగా, ఖర్చు చేసిన మొత్తం మాత్రం రూ. 30,213 కోట్లు (72 శాతం)గా ఉంది. ఈ నిధుల్లో అత్యధిక



భాగం గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు టెలికాం అనుసంధానత విస్తరించడానికి 'భారత్ నెట్ ప్రాజెక్టు' ద్వారా వినిమయం చేయడానికి కేటాయించినా అవి పూర్తిస్థాయిలో వ్యయం చేయలేదు.

ఈ లోపాలను అధిగమించి, టెలికాం రంగంలో మరింత విస్తారమైన సేవలు, వినూత్న కార్యాచరణలు ప్రతిపాదిస్తూ 'డిజిటల్ భారత్ నిధి'కి రూపకల్పన చేశారు. ఈ నిధిని టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్ 2023, సెక్షన్ 24(1) ప్రకారం ఏర్పాటు చేశారు.

డిజిటల్ భారత్ నిధి(డీబీఎన్)

యూఎస్ఓఎఫ్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకువచ్చిన ఈ డిజిటల్ భారత్ నిధి కార్యాచరణ పరిధిని మరింత విస్తరించారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు టెలీ కమ్యూనికేషన్స్ సేవలు విస్తరించడంతోపాటు, టెలీ కమ్యూనికేషన్‌కు సంబంధించిన సాంకేతికతలు, ఉత్పత్తుల అభివృద్ధికి, వివిధ రంగాల్లో పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ), పైలెట్ ప్రాజెక్టులకు, బలహీన వర్గాలు, వికలాంగులు, స్త్రీలు, స్వయం సహాయక సంఘాలు వంటి వారికి సహాయం చేసే పథకాలు/ప్రాజెక్టులకు ఈ నిధి నుంచి ఆర్థిక తోడ్పాటు లభిస్తుంది. అదేవిధంగా టెలికాం ఆపరేటర్ల నుంచి వసూలు చేసిన నిధులు(డీబీఎన్ నిధులు) టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్(2023) సెక్షన్ 25 ప్రకారం తొలుత సంఘటిత నిధికి జమ అవుతాయి. తదుపరి కేంద్రప్రభుత్వం ఆ నిధులను పార్లమెంటు ఆమోదంతో డీబీఎన్‌కి బదలాయిస్తుంది.

ఈ నిధికి సంబంధించి ప్రాధికార సంస్థ అయిన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్' ఇటీవల డిజిటల్ భారత్ నిధి నిర్వహణ నియమావళిని విడుదల చేసింది. ఈ నిధిని నిర్వహించే అడ్మినిస్ట్రేటర్ నియామకం, విధులు, నిధి లక్ష్యాలను అమలుచేసే ఇంప్లిమెంటర్(అమలుదారు) ఎంపిక వంటి అంశాల గురించి విశదీకరించడం జరిగింది. ఈ నియమావళి ప్రకారం, కేంద్రప్రభుత్వం డిజిటల్ భారత్ నిధికి ఒక అడ్మినిస్ట్రేటర్‌ను నియమిస్తుంది. బిడ్డింగ్ లేదా నామినేషన్ ద్వారా అమలుదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టడం, వారిని సమయానుసారం పర్యవేక్షించడం, వివాదాల పరిష్కారం, నిధుల పంపిణీ, నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించడం, మూల్యాంకనం తదితర విధులను అడ్మినిస్ట్రేటర్ కలిగి ఉంటాడు.

అమలుదారుల ఎంపిక ప్రాథమికంగా రెండు విధాలుగా ఉంటుందని నియమావళి సూచిస్తోంది. టెలీ కమ్యూనికేషన్స్ సర్వీస్ ప్రమోషన్ కోసం అమలుదారులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. అదే పరిశోధన, అభివృద్ధి కోసం అయితే అప్లికేషన్ ఆధారిత ఎంపిక జరుగుతుంది. ప్రత్యేక పరిస్థితుల్లో ఆపరేటర్స్‌ను నామినేట్ చేసే విచక్షణాధికారాన్ని అడ్మినిస్ట్రేటర్ కలిగి ఉంటారు. టెలీ కమ్యూనికేషన్స్ సేవలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సేవలను మెరుగుపర్చడం, నెక్ట్స్ జనరేషన్ సాంకేతికతల అభివృద్ధి, టెలీ కమ్యూనికేషన్స్ రంగంలో నవకల్పనలు, స్టార్టప్‌లు, పరిశోధనలకు మద్దతు ఇవ్వడం వంటి కార్యక్రమాలకు గాను అమలుదారుకు నిధులను కేటాయిస్తారు.

ఈ నిధులను అందరికీ ఒకే తరహాలో కాక, అమలుదారుల కార్యకలాపాలను ఆధారం చేసుకుని అడ్మినిస్ట్రేటర్ వారికి పూర్తిగా లేదా పాక్షికంగా కానీ, వయబిలిటీ గ్యాప్ ఫండింగ్, కో ఫడింగ్ తరహాలో నష్టభయాలను తగ్గించుకునేవిధంగా నిధుల కేటాయింపును నిర్ణయిస్తాడు.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

డీబీఎన్ ద్వారా ఆశిస్తున్న ప్రయోజనాలు

1. సమాచార యుగం లో డిజిటల్ అంతరాలను రూపుమాపి, ప్రతీ ఒక్కరికీ సమాచార విప్లవ ఫలితాలు అందేలా డిజిటల్ సమ్మిళితత్వాన్ని తీసుకురావడం. తద్వారా ఆర్థిక, సామాజిక అంతరాలను తగ్గించడం.
2. టెలికాం రంగంలో రాబోయే సరికొత్త తరం టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి వ్యవస్థాగత సంసిద్ధత, అవస్థాపన సౌకర్యాల అభివృద్ధి. ఉదాహరణకు ప్రస్తుతం పూర్తిస్థాయిలో 5జీ టెక్నాలజీని అందిపుచ్చుకునే సంసిద్ధత సాధించే లోపే 6జీ ప్రవేశానికి రంగం సిద్ధమవుతోంది. 5జీ కన్నా వెయ్యిరెట్లు వేగవంతమైన 6జీని భారత్‌లో ప్రవేశపెట్టాలంటే మరింత మెరుగైన ఫైబర్ ఆప్టిక్ కేబుల్ వ్యవస్థ, అనుసంధానతలపరమైన నెక్ట్స్ జనరేషన్ సాంకేతికతలను అభివృద్ధి పర్చుకోవాల్సి ఉంటుంది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి డీబీఎస్ నిధి సహకరిస్తుంది.
3. ప్రపంచస్థాయి ప్రమాణాల సాధన ద్వారా భారత టెలికాం రంగాన్ని అభివృద్ధి చేయడం, తద్వారా డిజిటల్ మార్కెట్‌ల విస్తృతి మరింత పెంచి ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం. వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు నేడు ఆటోమేటిక్ రూట్ ద్వారా అవకాశం ఉన్న సందర్భంలో మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం.
4. టెలికాం రంగ అభివృద్ధి ద్వారా ఈ-గవర్నెన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ వంటి పారదర్శక విధానాలను ప్రభుత్వ పాలనలో తీసుకురావడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించడం.
5. టెలికాం రంగంలో నవకల్పనలను, స్టార్టప్‌లను, పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడం ద్వారా భారతదేశాన్ని టెలికాం రంగ హబ్‌గా మార్చడం. రాబోయే కాలంలో మెటావర్స్, డ్రైవర్‌లెస్ కార్ల వంటి టెలికాం రంగ అనుసంధానత గల విప్లవాత్మక రంగాల్లో ఎర్లీ బర్డ్ అడ్వాంటేజ్‌ను సొంతం చేసుకోవడం.

అయితే ఇలాంటి ప్రయోజనాలను సొంతం చేసుకోవాలంటే అనేక సవాళ్లను అధిగమించాల్సి ఉంది. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలను, సైబర్ సెక్యూరిటీ సమస్యలను, ఈ-వేస్ట్ నిర్వహణ లోపాలను అధిగమించాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా టెలీడెన్సిటీ పరంగా 133.76%గా ఉన్న పట్టణస్థాయికి 58.56%గా ఉన్న గ్రామీణ స్థాయికి మధ్య ఉన్న భారీ అంతరాన్ని తగ్గించడానికి డీబీఎన్ నిధులను సమర్థవంతంగా వినియోగించాల్సి ఉంది. అప్పుడే భారత్ డిజిటల్ ఇండియా కల సంపూర్ణంగా సాకారమవుతుంది.

నంబర్ రిపీట్ టెస్ట్

రీజనింగ్

పార్ట్-1

ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో అనేక సంఖ్యల క్రమం(లాంగ్ నంబర్ సిరీస్) లేదా వర్ణమాల అక్షరాల క్రమం (ఆల్ఫాబెటికల్ లెటర్ సిరీస్) ఇస్తారు. ఈ రకమైన ప్రశ్నలకు అభ్యర్థి ముందుగా ప్రశ్నలో ఇచ్చిన నియమాన్ని జాగ్రత్తగా అవగాహన చేసుకొని కచ్చితంగా అదే నియమాన్ని అనుసరిస్తున్న సంఖ్యల సమూహాలు లేదా వర్ణమాల అక్షరాల సమూహాలు ఇచ్చిన సిరీస్‌లో ఎన్నిసార్లు వచ్చిందో సరిచూసుకొని నాలుగు ఆల్టర్నేటివ్ చాయిస్‌ల నుంచి సమాధానాన్ని గుర్తించాలి.

గమనిక: ఈ టెస్ట్‌కి సంబంధించిన ప్రశ్నలలో సాధారణంగా మూడు సంఖ్యలు లేదా మూడు వర్ణమాల అక్షరాలను ఒక సమూహంగా భావించాలి. (ముందు అనగా ఎడమవైపు, తరవాత అనగా కుడివైపు అని అర్థం)

1. కింది సంఖ్యాక్రమంలో ముందు 2 ఉండి, తరవాత 4 గల 3లు ఎన్ని ఉన్నాయి?

6 8 4 2 3 4 9 2 4 3 2 3 4 5 8 4 3 4 2 3 4 5 6

ఎ) మూడు బి) నాలుగు సి) రెండు డి) ఏమీలేవు

సమాధానం: (ఎ)

వివరణ: 6 8 4 2 3 4 9 2 4 3 2 3 4 5 8 4 3 4 2 3 4 5 6

పై ప్రశ్నలో '3'లు గురించి అడిగారు. కాబట్టి '3' 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు 2 ఉండటం అనగా 'బేసిక్' సంఖ్య అయిన '3'కి ఎడమవైపు 2 ఉండాలని అర్థం. తరవాత 4 అనగా 'బేసిక్' సంఖ్య అయిన '3' కి కుడివైపు 4 ఉండాలి. అనగా 234 అనే సమూహాలు మూడు ఉన్నాయి.

2. కింది సంఖ్యాక్రమంలో ముందు 4 లేకుండా, తరవాత 6గల '5'లు ఎన్ని ఉన్నాయి?

6 8 4 5 6 3 8 6 5 6 9 2 5 5 6 8 5 4 3 5 6 5 6 4

ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) అయిదు

సమాధానం: (సి)

వివరణ: 6 8 4 5 6 3 8 6 5 6 9 2 5 5 6 8 5 4 3 5 6 5 6 4

పై ప్రశ్నలో '5'లు గురించి అడిగారు. కాబట్టి '5' 'బేసిక్'గా తీసుకోవాలి. తరవాత 6 గల అనగా 5కి కుడివైపు 6 ఉండటం అని అర్థం. అనగా 56. ముందు 4 లేకుండా అనగా 5కి ఎడమవైపు 4 ఉండకూడదు. అనగా ఈ ప్రశ్న అర్థం 56కి ముందు(ఎడమవైపు) 4 లేని సమూహాలు నాలుగు ఉన్నాయి.

గమనించండి: పై ప్రశ్నలో 35656 అనే అయిదు సంఖ్యలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో గల నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.

3. కింది సంఖ్యాక్రమంలో ముందు 7 ఉండి, తరవాత 9 లేని '8'లు ఎన్ని ఉన్నాయి?

8 5 7 8 4 3 7 8 7 8 6 2 4 7 8 9 3 2 7 8 5 7 8 2 5

ఎ) మూడు బి) అయిదు సి) నాలుగు డి) ఆరు

సమాధానం: (బి)

వివరణ: 8 5 7 8 4 3 7 8 7 8 6 2 4 7 8 9 3 2 7 8 5 7 8 2 5

పై ప్రశ్నలో 8లు గురించి అడిగారు. కాబట్టి '8'ని 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు 7 ఉండి అనగా 8కి ఎడమవైపు 7 ఉండటం అని అర్థం అనగా 78. తరవాత 9 లేకుండా అనగా 8కి కుడివైపు 9 ఉండకూడదు. అనగా ఈ ప్రశ్న అర్థం 78కి తరవాత (కుడివైపు) 9 లేని సమూహాలు 5 ఉన్నాయి.

గమనించండి: పై ప్రశ్నలో 78786 అనే అయిదు సంఖ్యలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.

4. కింద ఇచ్చిన వర్ణమాల క్రమంలో ముందు 'L' ఉండి, తరవాత 'N' లేని 'M' లు ఎన్ని ఉన్నాయి?

J H K L M N Q P R N L M T R T P L M J K H J L M S Q K

ఎ) 3 బి) 4 సి) 5 డి) ఏమీలేవు

సమాధానం: (ఎ) అవుతుంది.

వివరణ: J H K L M N Q P R N L M T R T P L M J K H J L M S Q K ఇచ్చిన ప్రశ్నలో ముందు 'L' ఉండి తరవాత 'N' లేని 'M' లు అనగా LM ఉండి 'N' ఉండకూడదు.

Mలు ఎన్ని ఉన్నాయని అడిగారు. కాబట్టి 'M'ని బేసిక్‌గా తీసుకోవాలి. ముందు 'L' ఉండి అనగా 'M'కి ముందు అనగా ఎడమవైపు 'L' ఉండాలి అనగా 'LM'. తరవాత 'N' లేని అనగా 'N' కి కుడివైపు 'N' ఉండకూడదు.



ఈ ప్రశ్నలో Mకు ముందు 'L' ఉండి తరవాత 'N' లేని అక్షర సమూహాలు మూడు ఉన్నాయి. సమాధానం (ఎ) అవుతుంది.

5. కింది వర్ణమాల క్రమంలో ముందు A లేకుండా, తరవాత C లేకుండా గల 'B'లు ఎన్ని ఉన్నాయి?

C D B A G C B B D F C B A B C E B A B G

ఎ) అయిదు బి) మూడు సి) నాలుగు డి) ఆరు

సమాధానం: (ఎ)

వివరణ: C D B A G C B B D F C B A B C E B A B G

పై ప్రశ్నలో 'B'లు గురించి అడిగారు. కాబట్టి Bను 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు A లేకుండా అనగా 'B'కి ఎడమవైపు A ఉండకూడదు. తరవాత 'C' లేని అనగా 'B' కి కుడివైపు 'C' ఉండకూడదు. ప్రశ్నలో ఇచ్చిన ప్రతి 'B'ని పరిశీలిస్తే Bకి ఎడమవైపు Aలేని, Bకి కుడివైపు 'C' లేని సమూహాలు 5 ఉన్నాయి.

గమనిక: పై సిరీస్‌లో CBBD అనే 4 అక్షరాలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో గల నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

అబద్దయ్య, పార్థసారధిలకు ఘన సన్మానం



అబద్దయ్య, పార్థసారధిలను సత్కరిస్తున్న బీసీ సెల్ నేతలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 29: ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, డైరెక్టర్ కందుల నాగార్జున, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధిలను బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు వాకా మాధవరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కారంపూడి అంకమ్మరావు, పద్మశాలి సాధికార సమితి సభ్యుడు జొన్నాదుల బాలకృష్ణ, మంగళగిరి మండల బీసీ సెల్ అధ్యక్షుడు కతారి అప్పారావు, కోసూరి రాజశేఖర్, రుద్రు మురళీకృష్ణ, ఒడిశా నరేష్, కృష్ణబాబు, కలవకొల్లు వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఐ రోబోటిక్ ప్రదర్శన ప్రారంభోత్సవం

పెదనందిపాడు, సెప్టెంబరు 29 : స్థానిక లయన్స్ మాంటిస్సోరీ సీబీ ఎస్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ రోబోటిక్ ప్రదర్శనను సోమవారం ప్రారంభిస్తున్నట్లు పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ముద్దన నగరాజకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వస్తారని తెలిపారు. ఈ ప్రదర్శన విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు.

చలో గుంటూరును జయప్రదం చేయాలి

తాడేపల్లి, సెప్టెంబరు 29: నాన్ పర్మిమెంట్ కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 30న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమంలో భాగంగా సీఐటీయూ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 30వ తేదీ ఉదయం వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి ప్రదర్శన నిర్వహిస్తామని, సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం రవి తెలిపారు. మున్సిపల్ కార్మికులతో ఉండవల్లిలో ఆదివారం మాట్లాడుతూ ప్రదర్శన అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని ఈ ధర్నాలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జాషువా రచనలతో సమాజాన్ని మేల్కొలిపారు

తుళ్లూరు, సెప్టెంబరు 29: గుర్రం జాషువా తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపారని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎంవీ రవి అన్నారు. ఆదివారం మందడంలో జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జాషువా రచనలు ప్రతి ఒక్కరూ అన్వయించుకొని సమాజాన్ని చైతన్య పరచాల్సిన అవసరం ఉందన్నారు. మందడం సీపీఎం శాఖ కార్యదర్శిగా షేక్ జానీ, సహాయక కార్యదర్శిగా నండూరి శ్రీరామూర్తిలను ఎన్నుకున్నారు.

గుండిమెడలో డ్రైనేజి వ్యవస్థను పటిష్టపరచాలి

తాడేపల్లి, సెప్టెంబరు 29: ఏళ్ల తరబడి గ్రామంలో పరిష్కారం కాకుండా ఉన్న డ్రైనేజి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడలో పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన సీపీఎం శాఖ మహాసభలో ముఖ్యఅతిథిగా వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి దుర్వాసన వస్తోందని చెప్పారు. తద్వారా దోమలు ప్రబలి ప్రజలు జబ్బుల బారినపడే ప్రమాదం ఉందన్నారు. గ్రామంలో వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు అధికంగా ఉన్నారని చెప్పారు. గత మూడేళ్ల నుంచి గ్రామంలో ఉపాధి హామీ కార్మికులకు కార్పొరేషన్ పరిధిలో ఈ గ్రామం ఉన్నందున పనులు నిలిపివేస్తున్నామని అధికారులు చెప్పడంతో ఉపాధి హామీ కార్మికులకు పనులు లేకుండా పోయాయన్నారు. వెంటనే వారికి ఉపాధి కల్పించాలన్నారు. గుండిమెడ గ్రామాన్ని కార్పొరేషన్‌లో విలీనం కాకుండా ఉండే గ్రామంగానే ఉంచాలని సమావేశంలో తీర్మానించారు. తొలుత సీతారాం ఏచూరి, పుచ్చలపల్లి సుందరయ్య, గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పచ్చదనం, పరిశుభ్రతకు మంత్రి నారా లోకేశ్ చర్యలు

- సొంత ఖర్చులతో 5గ్రాస్ కటింగ్ మిషన్లు కొనుగోలు
- రోడ్లకు ఇరువైపులా గడ్డి, పిచ్చిమొక్కల తొలగింపు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 29: మంగళగిరి నియోజకవర్గాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గాన్ని పరి శుభ్రంగా ఉంచేందుకు సొంతంగా ఐదు గ్రాస్ కటింగ్ మిషన్లను కొనుగోలు చేశారు. వాటిని వినియోగించి రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించేందుకు ఐదుగురు కార్మికులను నియమించారు. వీరికి అవసరమైన జీత భత్యాలను కూడా మంత్రి లోకేశ్ తన సొంత నిధుల నుంచి వెచ్చిస్తున్నారు. ఒక్కో గ్రాస్ కటింగ్ మిషన్ కొనుగోలుకు రూ.18 వరకు ఖర్చు చేశారు. ఆదివారం ఉదయం పానకాల స్వామి ఘాట్ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో యంత్రాల సాయంతో గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించారు. ఆయా పనులను టీడీపీ నేతలు దగ్గరుండి పర్యవేక్షించారు. మంగళగిరి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మంత్రి లోకేశ్ చూపుతున్న చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మంగళగిరి ఘాట్ రోడ్డులో గడ్డిని కత్తిరిస్తున్న సిబ్బంది

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం

- మలినేని లక్ష్మయ్య గ్రూప్ విద్యాసంస్థల ఛైర్మన్ పెరుమాళ్ళు
- 385 మందికి కంటి పరీక్షలు, 192 మంది ఆపరేషన్‌కు ఎంపిక

పెదనందిపాడు, సెప్టెంబరు 29 : గ్రామీణ ప్రాంతాల్లో పేదల అవసరాలకనుగుణంగా దాతల సహకారంతో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మలినేని లక్ష్మయ్య గ్రూప్ విద్యాసంస్థల ఛైర్మన్ మలినేని పెరుమాళ్ళు అన్నారు. స్థానిక అశోకా స్కూల్ ఆవరణలో ఆదివారం రోటరీ క్లబ్ పెదనందిపాడు, నర్రా సుబ్బరామయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, కుమార్తె మాజీ ఎంపీపీ ముద్దన నగరాజకుమారిల సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి పెదకాకాని వారి సౌజన్యంతో మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మలినేని పెరుమాళ్ళు ప్రారంభించి మాట్లాడుతూ నర్రా సుబ్బరామయ్య ఈ ప్రాంతంలో లయన్స్ క్లబ్ ద్వారా ఎంతోమంది విద్యార్థులకు చేయూతనందించడంతో పాటు, పేదలకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి శుక్లాల ఆపరేషన్లు కూడా చేయించారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను వారి కుటుంబసభ్యులు కొనసాగించాలని తెలిపారు. వైద్యులు స్పందన, దీపికలు 385 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 192 మందిని శుక్లాల ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం రోటరీ క్లబ్ సభ్యులు దాత నర్రా మహాలక్ష్మమ్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిప్యూటీ గవర్నర్ పాటిబండ్ల శివరంజని, మాజీ ఎంపీపీలు నర్రా బాలకృష్ణ, ముద్దన నగరాజకుమారి, పారిశ్రామికవేత్తలు దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య రోటరీ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ పోపూరి లక్ష్మీనారాయణ, పోపూరి నాగేశ్వరరావు, రోటరీ అధ్యక్ష కార్యదర్శులు నల్లపునేని శివప్రసాద్, నాగేశ్వరరావు, కోశాధికారి కె.నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మలినేని లక్ష్మయ్య గ్రూప్ విద్యాసంస్థల ఛైర్మన్ మలినేని పెరుమాళ్ళు

కొలనుకొండలో మెగా వైద్యశిబిరం

తాడేపల్లి, సెప్టెంబరు 29: తాడేపల్లి మండలం కొలనుకొండలో మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరాన్ని ఎంటీఎంసీ డిప్యూటి కమిషనర్ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవా సంస్థ చేస్తున్న సేవలను అభినందిస్తూ ఇటువంటి శిబిరాలు ప్రజలు సద్వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. వంగర సురేష్‌కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రతి నెలా వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ వైద్యశిబిరంలో వైద్యులు డాక్టర్ వంశీ, రవిబాబు,, శ్రీకర్, శశిధర్, మాధురి, వినోద్, లీలాకృష్ణ, జయకృష్ణ పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు కాట్రగడ్డ శివన్నారాయణ, శంకర్‌బాబు, నూతక్కి శ్రీనివాసరావు, సామల నాగేశ్వరరావు, హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లి మండలం మెల్లెంపూడి ఎంపీయూపీ స్కూల్లో టీడీపీ గ్రామ అధ్యక్షుడు షేక్ నాగుల్ ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వారి సంయుక్త సహకారంతో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ మడల అధ్యక్షుడు అమరా సుబ్బారావు మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వారు కార్డియాలజీ, రుమటాలజీ, జనరల్ మెడిసిన్, ఈసీజీ, పరీక్షలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో షేక్ నాగుల్, అమరా సుబ్బారావు, షేక్ ఖాసింబాబు, కళ్యాణ్, నాగుల్‌మీరా, వెంకటప్పారెడ్డి, అమాన్ తదితరులు పాల్గొన్నారు.



మెల్లెంపూడి వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రకాశం బ్యారేజి దిగువకు 21వేల 660 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 29: ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 33 వేల 578 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.9 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 30 గేట్లను అడుగు మేర ఎత్తి దిగువకు 21వేల 660 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 11 వేల 918 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 5000 క్యూసెక్కులు


దుగ్గిరాల, సెప్టెంబరు 29: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 5000 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.9 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 21,660 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 1122 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 105 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 60 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 166 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రాజధాని పనులు వెంటనే ప్రారంభించాలి

- అసైన్డ్ రైతులకు పెండింగ్ కౌలు చెల్లించాలి
- సీపీఎం శాఖ మహాసభ తీర్మానాలు

తుళ్లూరు, సెప్టెంబరు 29: రాజధాని అమరావతి అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని, పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని, అసైన్డ్ రైతుల పెండింగ్ కౌలు చెల్లించాలని తదితర అంశాలపై సీపీ ఎం శాఖ మహాసభ తీర్మానాలు చేసింది. ఆదివారం మందడం కార్యాలయంలో ఈ సందర్భంగా సీపీ ఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి విలేకరులతో మాట్లాడుతూ రాజధాని లో వ్యవసాయం లేని మీదట పేదలు ఉపాధిలేక అల్లాడుతున్నారన్నారు. ఉపాధి చూపించే చర్యలు సీఆర్డీఏ ప్రభుత్వం చేపట్టాలని కోరారు. నిరంతరం వీఐపీ లు తిరిగే మందడంలో పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. పేదల టీడ్కో గృహాల బ్యాంకు రుణాలను రద్దు చేయాలన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు గడ్డం కృష్ణ, కుంభ అంజనేయులు, ఎర్రమనేని శ్రీనివాసరావు, షేక్ జానీ, నండూరి శ్రీరాంమూర్తి, జీ చెంచయ్య, బసవపున్నయ్య, మోషే, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు గీత కార్మికుల కృతజ్ఞతలు



దుగ్గిరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న కల్లుగీత కార్మికులు

దుగ్గిరాల, సెప్టెంబరు 29: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల హామీ నిలబెట్టుకుంటూ తీసుకున్న నిర్ణయానికిగానూ కల్లుగీత కార్మికులు, కృతజ్ఞతాభివందనం తెలియజేస్తూ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. రాష్ట్రంలోని మద్యం దుకాణాల్లో కల్లుగీత కార్మికులకు 10శాతం రిజర్వేషన్ కల్పిస్తామని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ దుగ్గిరాల గ్రామవీధుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌ల ఫ్లెక్సీతో ఆనందోత్సాహాల నడుమ ర్యాలీ నిర్వహించిన అనంతరం పాలాభిషేకం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంచర్ల వెంకటేశ్వరరావు, ఏమినేని కోటేశ్వరరావు, జూపల్లి వెంకటేశ్వరరావు, ఉప్పాల సురేష్, వీరంకి లక్ష్మీకుమార్, కీర్తి పవన్ ఆరేపల్లి భరత్, కీర్తి నాగతేజ, ఆనంద్, పోతురాజు, పరిశ హరీష్, ఉయ్యూరు వేణు, యార్లగడ్డ వేణు తదితర కల్లుగీత కార్మికులకు సంఘీ భావంగా టీడీసీ నాయకులు గూడూరు వెంకట్రావు, వల్లూరు నరసింహారావు, పర్వతనేని హర్ష, సూరగాని కల్యాణ్, వీరంకి సాంబశివరావు, వాసిరెడ్డి సుధాకర్ ర్యాలీలో పాల్గొన్నారు.

పాటలతో సమాజంలో చైతన్యం నింపిన రత్తయ్య

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 29: విప్లవ భావాలతో కూడిన తన పాటలతో పారెళ్ల రత్తయ్య సమాజంలో చైతన్యం తీసుకువచ్చారని ప్రజానాట్య మండలి జిల్లా నేత కంచర్ల కాశయ్య అన్నారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర నేత, కళాకారుడు పారెళ్ల రత్తయ్య ద్వితీయ వర్ధంతి సభ మంగళగిరి సీపీఐ కార్యాలయం వేములపల్లి శ్రీకృష్ణభవన్‌లో ఆదివారం జరిగింది. తొలుత రత్తయ్య చిత్రపటానికి కళ, సాహిత్య రంగ ప్రముఖులు నివాళి అర్పించారు. వక్తలు మాట్లాడుతూ రత్తయ్య దివ్యాంగుడైన ప్పటికీ ప్రజాఉద్యమ బాటలో నడుస్తూ తన పాటలతో స్ఫూర్తి నింపారని కొనియాడారు. ఈ సభలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య కళ, సాహిత్య రంగ ప్రముఖులు డాక్టర్ గోలి రామ్మోహన రావు, నన్నపనేని నాగేశ్వరరావు, రేఖా కృష్ణార్జునరావు, అల్లక తాతారావు, గోలి మధు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సందుపట్ల భూపతి, కారుమంచి రామా రావు, జాలాది జాన్‌బాబు, శ్రీధర్, శిందె బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయపూడి ఇసుక రీచ్ దారికి కందకం

తుళ్లూరు, సెప్టెంబర్ 29: రాయపూడి ఇసుక రీచ్‌లో వాహనాలు వెళ్లకుండా తుళ్లూరు పోలీసులు దారికి అడ్డంగా జేసీబీ యంత్రంతో ఆదివారం సాయంత్రం కందకం (గాడి) తీయించారు. రాత్రులు ఇసుక తరలుతుందనే ఆరోపణలు రావటంతో తుళ్లూరు సీఐ-2 అంజయ్య ఈ గాడి తీయించారు. అనుమతులు లేని రీచ్‌లోకి వాహనాలు నిషేధమని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



బాధిత కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

పేదలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం

- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- అరుదైన వ్యాధి చికిత్స ఖర్చులకు చేయూత
- సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.6లక్షలు అందజేత

తెనాలి రూరల్, సెప్టెంబరు 29: ఖరీదైన వైద్యసేవలు సైతం పేదలకు చేరువ చేసి వారి ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోన్నదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని చావావారిపాలెంకు చెందిన బొడ్డు కిరణ్‌కుమార్ అరుదైన ఊపిరితిత్తులు, గుండెకు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ అరుదైన అనారోగ్య సమస్యకు చికిత్స అందించే పరిస్థితి లేక కర్నాటక రాష్ట్రంలోని నారాయణ హృదయాలయ ఆసుపత్రిలో బాధితులు సంప్రదించారు. వైద్య పరీక్షల అనంతరం రూ.8 లక్షలమేర ఖర్చు అవుతుందని తెలిపారు. పేదలు కావడంతో అంతపెద్దమొత్తంతో వైద్యసేవలు పొందే వీలులేక మంత్రి మనోహర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దృష్టికి బాధితుని ఆర్థిక పరిస్థితిని అనారోగ్య సమస్యను వివరించారు. సీఎంఆర్ఎఫ్ ఫండ్ నుంచి ఆ కుటుంబాన్ని ఆదుకునేలా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6లక్షలు విడుదల చేయించారు. ఆదివారం తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి మంత్రి మనోహర్ ఆ చెక్కును అందించారు. కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తుందని అనారోగ్య సమస్యలుండి ఆర్థిక పరిస్థితి సహకరించకుంటే తమ దృష్టికి తీసుకురావచ్చని మంత్రి మనోహర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దగ్ధమైన పూరింటిని పరిశీలిస్తున్న ఉపసర్పంచ్ నాగభూషణం

పూరిల్లు దగ్ధం.. బాధితులకు ఉపసర్పంచ్ సాయం

తెనాలి రూరల్, సెప్టెంబరు 29: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిళ్లు, పశువుల చావిడి దగ్ధమైంది. మండలంలోని అంగలకుదురులో శనివారం అర్ధరాత్రి సమయంలో బెల్లంకొండ అంకమ్మరావుకు చెందిన పూరిల్లు, ఉప్పాల గోపికి చెందిన పశువుల చావిడి కరెంట్ షార్టుసర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో చావిడిలో ఉన్న పశువులను బయటకు తీసుకురాగా ఇంట్లో ఉన్న వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం గ్రామస్థులతో కలిసి మంటలను అదుపుతెచ్చే సహాయక చర్యల్లో పాల్గొని ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. తక్షణ ఖర్చుల నిమిత్తం రూ.7000 ఆర్థికసాయం అందించారు. కొబ్బరిచెట్లు ఎక్కి బొండాలు కిందకు దించి వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకునే అంకమ్మరావు ఇల్లుకోల్పోవడం తనకు ఎంతో బాధకలిగించిందన్నారు. ప్రభుత్వ అధికారులు దృష్టికి తీసుకువెళ్లి అతడికి సాయం అందేలా చూస్తానని నాగభూషణం తెలిపారు.



దాతలను అభినందిస్తున్న మానవత చైర్మన్ సుబ్రహ్మణ్యం

వరద బాధితులను ఆదుకున్న దాతలకు సన్మానం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 29: మానవతా సంస్థ ఆధ్వర్యంలో వరద బాధితులకు సాయం అందించేందుకు చేయూత ఇచ్చిన దాతలను ఆదివారం సత్కరించారు. ఇటీవల వరదల్లో లంక గ్రామాల్లో 1250 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు దాతలు రూ.5 లక్షలు సాయం చేశారు. వీరిని జ్ఞాపికలతో సన్మానించారు. సంస్థ రీజనల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, సంస్థ కార్యకలాపాల కోసం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి చేయాలన్నారు. చైర్మన్ కొలసాని రాంచంద్ మాట్లాడుతూ, సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు కూడా నిర్వహించాలని కోరారు. డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, ప్రసాద్, వెంకట్, సోమయ్యశాస్త్రి, సత్యనారాయణ పాల్గొన్నారు. కూరపాటి రవీంద్రనాథ్, కళ్యాణి దంపతులు సహకారంతో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని తేజస్వినికి రూ.10 వేలు, డిగ్రీ చదువుతున్న విద్యార్థి జనార్ధనరావుకు రూ.12 వేలు సాయం అందించారు.



పురస్కారం అందుకుంటున్న మురళీకాంత్

నెహ్రూ నికేతన్‌కు జాతీయ ఉత్తమ పాఠశాల పురస్కారం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 29: బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలకు జాతీయ ఉత్తమ పాఠశాల పురస్కారం లభించింది. లీడ్ స్కూల్ ఆధ్వర్యంలో ఉత్తమ పాఠశాలలను ఎంపికచేసి హైదరాబాద్‌లో శనివారం రాత్రి పురస్కారాలు ప్రదానం చేశారు. స్కూల్ వ్యవస్థాపకులు సుమిత్ మెహతా, బిజినెస్‌హెడ్ దీపక్ హరిహరన్ చేతుల మీదుగా నెహ్రూనికేతన్ ఎండీ మురళీకాంత్ పురస్కారం అందుకున్నారు. విద్యా విధానంలో ప్లేవే మెథడ్స్‌తో పాటు యాక్టివిటీ బేస్డ్ ఎడ్యుకేషన్ అందిస్తున్నామని ఆయన చెప్పారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శశిభూషణ్ తదితరులు

వర్గీకరణ పేరుతో విడదీయడం అన్యాయం

- మాల మహానాడు జేఏసీ నేత శశిభూషణ్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 29: మాల, మాదిగలను వర్గీకరణ పేరుతో విడదీయడం అన్యాయమని మాల మహానాడు జేఏసీ నేత, న్యాయవాది బి.శశిభూషణ్ అన్నారు. తెనాలి డివిజన్ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కుట్రపూరిత రాజకీయాలతో రాష్ట్రంలో వర్గీకరణ చేస్తే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. దళితులు ఉద్యమకారులుగా కాకుండా రాజకీయ నాయకులుగా ఉద్భవిస్తారని చెప్పారు. వర్గీకరణ ప్రయత్నాలు మానుకోవాలని కోరారు. ఎంఈవో జయంత్‌బాబు, కారుమంచి రవికుమార్, పంతగాని రమేష్, దాసరి చెన్నకేశవులు, చైతన్య, బుల్లియ్య, ప్రదీప్, కోటేశ్వరరావు, కిరణ్ కుమార్, అబ్రహంలింకన్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరాయుడు సత్రం దస్త్రాలు సురక్షితమేనా..?

- 2006 ముందు రికార్డులు ధ్వంసం
- అక్రమాలు వెలుగులోకి రాకుండా ఫైల్స్ దహనం చేశారని ఆరోపణలు
- నేటికీ జరగని విచారణ





పట్టణ ప్రధాన కూడలి ఐలాండ్ సెంటర్‌లోని సుబ్బరాయ ధర్మసత్రం భవనం, తగలబడిన రికార్డులు (ఫైల్ ఫోటో)

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 29: పొన్నూరు పట్టణంలో ఆలపాటి సుబ్బరాయుడు ధర్మసత్రం రికార్డులు అదృశ్యంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పొన్నూరు పట్టణానికి చెందిన దాత ఆలపాటి సుబ్బరాయుడు దశాబ్దాల క్రితం పొన్నూరు పట్టణానికి వచ్చే పేదలు, సామాన్యులు, సేదతీరటానికి, ఆకలి బాధలు తీర్చుకోవటానికి పొన్నూరు పట్టణ ప్రధాన కూడలి ఐలాండ్ సెంటర్‌లో ధర్మసత్రంను స్థాపించారు. సత్రం నిర్వహణ కోసం 20ఎకరాల భూమిని కేటాయించారు. కాలక్రమేణా ప్రధాన కూడలిలోని స్థలం కోట్లాది రూపాయల విలువలకు చేరటంతో స్థలం అన్యాక్రాంతం కాకుండా గతంలో కళ్యాణ మండపాన్ని నిర్మించారు. రహదారివెంట దుకాణాలు ఏర్పాటుచేసి అద్దెకు ఇచ్చారు. ఈ సత్రం నిర్వహణ మొత్తం ఈ కల్యాణ మండపం అద్దెలు, షాపుల లీజులు, వ్యవసాయ భూమి కౌలు ద్వారా నిర్వహించబడుతోంది. ఈ సత్రం ద్వారా ప్రతి రోజూ పేద వారికి ఉచితంగా ఆహారం అందించటం ప్రతిఏటా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించి వారి విద్యాభివృద్ధికి పాటుపడుతున్నారు. అయితే ఇటీవల ఈ సత్రం రికార్డులకు సంబంధించి పలు సంచలన విషయాలు వెలుగుచూస్తున్నాయి. సత్రం రికార్డులు ప్రస్తుతం ఉన్న దేవదాయ శాఖ అధికారుల వద్ద అందుబాటులో లేకపోవటంతో లోతుగా విచారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగుచూశాయి.

రికార్డుల దగ్ధంపై అనుమానాలు

ఆలపాటి సుబ్బరాయుడు ధర్మ సత్రం రికార్డులను దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది దహనం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. 2006 నుంచి 2021వరకు సత్రం మేనేజర్‌గా మామిడాల శ్రీనివాసరావు పనిచేశారు. 2021లో సత్రం మేనేజర్‌గా మల్లేశ్వరరావు విధుల్లో చేరారు. అయితే 2006కు ముందు ఉన్న రికార్డులు ప్రస్తుతం ఉన్న సత్రం మేనేజర్ వద్ద అందుబాటులో లేదు. గతంలో జరిగిన భారీ అవినీతి అక్రమాలు వెలుగు చూడకూడదనే దురుద్దేశంతో ఈ సత్రం రికార్డులను తగలబెట్టారని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ రికార్డులన్నీ గతంలో సత్రంలోని ఒక గదిలో భద్రపరిచేవారు. కీలక రికార్డులు, విద్యార్థులకు అందచేసిన ఉపకార వేతనాల రికార్డులు బడ్జెట్ తీర్మానాలు, క్యాష్ బుక్‌లు, ఆడిట్ రిపోర్టులు వంటి కీలక రికార్డులు సత్రంలో అందుబాటులో లేవు. అంతేకాకుండా సత్రం ఆస్తులకు సంబంధించిన పలు వివరాలు, దస్తావేజులు కూడా అందుబాటులో లేకుండా పోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రికార్డులను ధ్వంసం చేశారని ఆరోపణలు ఉన్నాయి. సత్రం విలువైన ఆస్తులు కాజేయటానికి ప్రయత్నం జరిగిందనే అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సత్రం ఆస్తుల నుంచి ప్రతిఏటా లక్షలాది రూపాయలు ఆదాయం వివిధ మార్గాల్లో వస్తుంటుంది. ఈ ఆదాయ, వ్యయ వివరాలలో భారీ అవినీతి చోటు చేసుకుందని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ అవినీతి అక్రమాలు వెలుగు చూడకుండా ఉండేందుకు గుట్టుచప్పుడు కాకుండా సత్రం ప్రాంగణంలోనే రికార్డులు తగలబెట్టారని స్థానికులు వెల్లడిస్తున్నారు. అయితే ఈ రికార్డుల దహనం అంశం దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు స్థానిక సిబ్బంది తెలియజేసినప్పటికి విచారణ జరపకుండా గోప్యత పాటించటంపై అనుమానాలు ఉన్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారి వైసీపీ మాజీ ప్రజా ప్రతినిధి మామ దగ్గర బంధువు కావటం వల్లనే రికార్డుల అంశం తొక్కిపెట్టారని దేవదాయ శాఖ సిబ్బందే వెల్లడిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ దాతలు సదుద్దేశంతో నిర్మించిన సత్రాలు అధికారుల అవినీతికి ఆలవాలంగా మారాయని స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. రికార్డుల దహనంపై ప్రస్తుత మేనేజర్ మల్లేశ్వరరావును వివరణ కోరగా 2006కు ముందు ఉన్న రికార్డులు తన వద్ద అందుబాటులో లేనట్లు చెప్పారు. తనకు ముందుకు పనిచేసిన మేనేజర్ శ్రీనివాసరావు 2006నుంచి రికార్డులు అప్పచెప్పారన్నారు. ఈ విషయమై దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు లేఖ ద్వారా తెలియజేసినట్లు మేనేజర్ మల్లేశ్వరరావు తెలిపారు. అయితే రికార్డుల దహనం సమాచారం తనకు తెలియదన్నారు.

పెదకాకానిలో పవిత్రోత్సవాలు ప్రారంభం

- ఆలయ ఈవో జి లీలా కుమార్



పెదకాకాని శివాలయంలో పవిత్రోత్సవాలను ప్రారంభిస్తున్న ఆలయ ఈవో లీలా కుమార్

పెదకాకాని, సెప్టెంబరు 29: పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో పవిత్రోత్సవాలు ఆదివారం శైవాగమ ఆగమం అనుసరించి ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చక, అర్చకస్వాములు, వేదపండితుల పర్యవేక్షణలో శాస్త్రోక్తకంగా ప్రారంభించినట్లు ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. పవిత్రోత్సవాలలో భాగంగా పవిత్ర వెదురుపేటికలతో ఆలయ యజ్ఞశాల ప్రదక్షిణ పూర్వకంగా యాగశాల ప్రవేశం, బలిహరణ తీర్థప్రసాద వినియోగం జరిగిందన్నారు. సాయంత్రం మంగళ వాయిద్యం, చతుర్వేదపారాయణలు, గోపూజ అనుజ్ఞ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, వాస్తుశాంతి, రక్షాబంధనం, మంత్రపుష్పం, హారతి విభూతి, కుంకుమ ప్రసాద వితరణ జరిగినట్లు ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. పవిత్రోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఉపకమిషనరు విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 29: స్థానిక ఐతానగర్‌లో ఆదివారం యంగ్ జనరేషన్ టీం అధ్యక్షుడు సాధిక్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చేయి, కాలు కోల్పోయిన అన్నారావు కుటుంబానికి ఒక బస్తా బియ్యం, నిత్యవసరాల కిట్‌ను అందజేశారు. అదే ప్రాంతానికి చెందిన దాసు అనే వ్యక్తి గతంలో ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యారు. అతని కుటుంబానికి కూడా బియ్యం బస్తా ఒకటి, నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాధిక్ మాట్లాడుతూ దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రూ.10వేల రూపాయల విలువైన సరుకులను అందించామన్నారు. కార్యక్రమంలో టీం సభ్యులు శివ, నవీన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థికసాయం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 29: స్థానిక మారీసుపేట సీఎం కాలనీలో ఆదివారం తలకు సంబంధించిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న భాగ్యలక్ష్మి అనే మహిళకు హెల్పింగ్ సోల్జర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ ఇనయతుల్లా ఐదువేల రూపాయల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఇనయతుల్లా మాట్లాడుతూ భాగ్యలక్ష్మి అనే మహిళ బ్రెయిన్‌లో గడ్డలు ఏర్పడి అనారోగ్యంతో బాధపడుతూ మందులు కూడా కొనలేని పరిస్థితిలో ఉన్నారని తెలిసి దాతల సహకారంతో ఆర్థిక సాయం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివతేజ, జాస్తి మోహనరావు, త్రిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 29: రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మారీసుపేట ఎరువులకొట్లు బజారులో ఆగివున్న కారులోని వ్యక్తి డోరు తీయగా అదే సమయంలో అటుగా వెలుతున్న ఆటోలోని యువకుని కాలుకు డోరు తగిలి తీవ్ర గాయం అయిందని తెలిపారు. స్థానికులు వెంటనే అదే ఆటోలో గాయపడిన యువకుడిని వైద్యశాలకు తరలించారని స్థానికులు తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోవాలి

- టీడీపీ బీసీ సెల్ నాయకుడు తాటి శంకర్



ఓటర్ నమోదు హెల్ప్‌లైన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 29: కృష్ణా, గుంటూరు జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని టీడీపీ బీసీ సెల్ నాయకులు తాటి శంకర్ కోరారు. మండల పరిధిలోని నారాకోడూరు గ్రామంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు ఆన్‌లైన్ హెల్ప్ లైన్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ నెల 30వ తేదీ నుంచి నవంబరు 6 వరకు పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో లగడపాటి వేణుగోపాల్, తోట శ్రీనివాసరావు, జి శ్రీనివాసరావు, వెలగా పవన్ కుమార్, లగడపాటి సూర్యనారాయణ వర్మ, డి శ్రీనివాసరావు, శ్రీహరి, వెలగా జైకృష్ణచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పన హామీని చిత్తశుద్ధితో అమలు చేయాలి

- కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్క రవీంద్రనాథ్

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 29: ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన 20లక్షల ఉద్యోగాల కల్పన హామీని చిత్తశుద్ధితో అమలు చేయాలని కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్క రవీంద్రనాథ్ ఆదివారం కోరారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి గెలుపు నిస్వార్థంగా రాష్ట్ర యువత తోడ్పాటు నందించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో యువత ఉద్యోగాల కల్పన లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. అందుకే కూటమి పార్టీలు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీకి ఆకర్షితులై కూటమిని గెలిపించారన్నారు. ఉద్యోగాలను భర్తీచేసి యువత ఆశలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న ప్రయాణికులు

ఆర్టీసీ సిబ్బందికి నగదు రివార్డు

తెనాలి క్రైం, సెప్టెంబరు 29: ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరిస్తూ ఆ మార్గంలో ప్రయాణికుల్లో గుర్తింపు తెచ్చుకోవడమే గాక సంస్థ ఆదాయానికి తోడ్పడుతున్న ఇద్దరు ఉద్యోగులకు ప్రయాణికులతో నగదు అవార్డు ఇచ్చి ప్రోత్సహించినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ ఆదివారం తెలిపారు. తెనాలి-భట్టిప్రోలు మార్గంలో కండక్టర్‌గా పనిచేస్తున్న డి.వెంకటేశ్వరమ్మ, డ్రైవర్ వి.నారాయణలు ప్రయాణికులతో మమేకమవుతూ, వారితో మర్యాదపూర్వకంగా మెలగడం గుర్తించిన ఈ మార్గంలో నిత్యం ప్రయాణించే వై.చింపయ్య, జి.రేణుకయ్య అనే ప్రయాణికులు ఈ సిబ్బంది అందిస్తున్న సేవలకు గుర్తింపుగా డిపోకి వచ్చి వారిద్దరికి నగదు ప్రోత్సాహకాలు అందించారన్నారు. సిబ్బంది, ప్రయాణికులతో మర్యాదగా, ఓర్పుతో వ్యవహరిస్తూ సంస్థకు గుర్తింపు తేవాలని డీఎం కోరారు. ప్రోత్సాహకాలు అందుకున్న సిబ్బందిని డీఎం అభినందించారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

రాజకీయాల్లో ఎన్టీఆర్ రాకతో నూతన శకం

- మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 29: రాజకీయాల్లోకి ఎన్టీఆర్ రాకతో నూతన శకం మొదలైందని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. నవరసాల నటుడు నందమూరి శతకావిష్కరణ సమారోహం అనే పుస్తకాన్ని ఆదివారం కాకతీయ బ్యాంకు సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల వద్దకు అధికారులను, ప్రజా ప్రతినిధులను తీసుకురావడంతో పాటు బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. సినీ, రాజకీయ రంగాలలో ఎనలేని ఖ్యాతి గడించిన ఆయన తెలుగు ప్రజల వైభవాలను ప్రపంచానికి చాటారని చెప్పారు. రచయిత జగదీష్‌చంద్ర శర్మ, రాజశేఖర్, పాలడుగు ఆనందయ్య, బీరం సుందరరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి పాల్గొన్నారు.

విద్వేష రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలి

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు లక్ష్మీ నారాయణ

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 29: బీజేపీ అనుసరిస్తున్న విభజన విద్వేష రాజకీయాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండ లక్ష్మీ నారాయణ అన్నారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సీపీఎం శాఖ మహాసభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సీపీఎం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిన్న ఉద్యోగులను రాజకీయ కారణాలతో తొలగించటాని ఖండించారు. విశాఖ ఉక్కును కాపాడుకోవాటానికి పార్టీలకు అతీతంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అక్టోబరు 4వ తేదీన భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహిస్తునట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారామ్ ఏచూరి, మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యవర్గ ఎన్నిక జరిగింది. మండల కార్యదర్శిగా రెండోసారి బొనిగల ప్రభుదాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు రమేష్‌బాబు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు నిలయంగా తెనాలిని తీర్చిదిద్దుదాం

- వార్డు పర్యటనలో మంత్రి మనోహర్

తెనాలిరూరల్, సెప్టెంబరు 29: ప్రజలందరి సహకారంతో పట్టణాన్ని పచ్చదనం పరిశుభ్రతలకు మారుపేరుగా తీర్చిదిద్దుకుందామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం మంత్రి మనోహర్ అధికారులతో కలిసి పట్టణంలోని రామలింగేశ్వరపేటలో పర్యటించి ప్రజల యోగక్షేమాలను విచారించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో పట్టణంలోని మురుగు పారుదల అయ్యే కాలువలు సైతం పూడికలు తీయించలేకపోయిందని ఫలితంగా ప్రజలు దోమల బెడతోపాటు చిన్నపాటి వర్షం కురిసినా మురుగు నీరుతో వర్షపునీరు కలిసి రోడ్లపైనే చెరువులను తలపిస్తూ అపరిశుభ్ర వాతావరణంలో గడిపే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. తాము అధికారం చేపట్టిన వెంటనే ఆ సమస్య పరిష్కార దిశగా అడుగులు వేసి పూడిపోయిన మురుగు కాలువలను బాగుచేయించి కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో అన్ని వార్డుల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని పరిష్కరించడం జరుగుతుందని మనోహర్ స్పష్టం చేశారు. మునిసిపల్ కమిషనర్ శేషన్న. పలుశాఖల అధికారులు కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల ఆత్మీయ సమావేశం

పట్టణంలోని పుట్టా రాఘవయ్య రైస్‌మిల్‌లో ఆదివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పలు వార్డుల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో చేపట్టవలసిన కార్యాచరణపై చర్చించారు.



ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో జాతీయ అశోక పురస్కారాన్ని అందుకుంటున్న మాజీ అదనపు డీజీపీ బాబూరావు

బాబూరావుకు జాతీయ అశోక పురస్కారం

తెనాలి, సెప్టెంబర్ 29, (ఆంధ్రజ్యోతి): పోలీస్ విధుల్లో ఉన్నా, ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా ప్రజలకోసం, వారి హక్కులు, మంచి జీవితాల కోసం ఆయన చేసిన సేవలకు గుర్తుగా జాతీయ అశోక పురస్కారాన్ని ప్రదానం చేశారు. తెనాలికి చెందిన విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ బాబూరావుకు ఈ మేరకు ఆదివారం ఢిల్లీలో ఈ పురస్కారాన్ని అందించారు. చార్లెస్ వాల్టర్స్ కౌనిల్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ బ్యూరోక్రాట్స్ సంస్థలు సంయుక్తంగా ఆయనకు ఈ పురస్కారాన్ని అందించాయి. తెనాలికి చెందిన ఆయన ఐపీఎస్‌గా అనేక ప్రాంతాల్లో నిబద్ధతతో పనిచేశారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా 2024 సంవత్సరానికిగాను అశోక అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ సర్వీస్ పురస్కారాన్ని ఆయనకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.పి.సింగ్ చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.



3కే రన్ ప్రారంభిస్తున్న కమిషనర్ రమేష్ బాబు

స్వచ్ఛ పొన్నూరుకు సహకారం అందించాలి

- 3 కే రన్‌లో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 29: స్వచ్ఛ పొన్నూరుగా పట్టణానికి మార్చేందుకు పట్టణ పౌరులు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు కోరారు. పొన్నూరు పట్టణంలో ఆదివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా 3కే రన్ నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంల నుంచి నిడుబ్రోలులోని పద్దన్న చెరువు వరకు ఈ 3కే రన్ సాగింది. మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ జెండా ఊపి రన్ ప్రారంభించారు. ఆర్టీసీ డిపో సెంటర్, తహసీల్దార్ కార్యాలయం, గాంధీ సెంటర్, కూరగాయల మార్కెట్, ఐలాండ్ సెంటర్ మీదుగా నిడుబ్రోలు వరకు ఈ 3కే రన్ సాగింది. పొన్నూరు పట్టణానికి చెందిన యువత, వాకర్స్ ఈ 3కే రన్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావటం హర్షణీయం అన్నారు. పొన్నూరు పట్టణంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు ఇప్పటికే మురుగు కాల్వలో సిల్ట్ తొలగింపు చర్యలు చేపట్టటమే కాకుండా జనావాసాల మధ్య మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటునట్లు చెప్పారు. దోమలు వ్యాప్తిని అరికట్టినట్లు వివరించారు. ప్రతి రోజూ ప్రజలకు సరఫరా అవుతున్న నీటిని పరీక్షించి శుద్ధిచేసిన నీటినే అందిస్తున్నామన్నారు. అలాగే పట్టణంలో తాగు నీటి సమస్యల తలెత్తకుండా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ సూచనలతో పట్టణంలోని మూడు ప్రాంతాలో రూ. 17.50 కోట్ల వ్యయంతో మూడు ఓవర్ హెడ్‌ల ట్యాంక్‌ల నిర్మాణం, పైప్ లైన్లు ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు వివరించారు. ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కూటమి పార్టీల నాయకులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.



వల్లభాపురం సమీపంలో కుంగిపోయిన చినకరకట్ట రోడ్డు



కొల్లిపర వంతెన వద్ద పూర్తిగా కోతకు గురైన రోడ్డు

ప్రమాద భరితంగా చినకరకట్ట రోడ్డు

కొల్లిపర, సెప్టెంబరు 29: రేపల్లె కాల్వకు అనుకుని ఉన్న చిన కరకట్ట రోడ్డు ప్రమాద భరితంగా మారింది. రేపల్లె కాల్వకు నీటిని ఎక్కువగా విడుదల చేయడంతో చినకరకట్ట రోడ్డు పలు చోట్ల కోతకు గురిఅయ్యింది. దీంతో చినకరకట్ట రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కొల్లిపర మండలంలో అన్నవరం నుంచి వల్లభాపురం వరకు వెళ్లే చినకరకట్ట రోడ్డు రేపల్లె కాల్వకు విడుదల చేసిన నీటి ప్రవాహానికి పలుచోట్ల కోతకు గురిఅయ్యింది. ఈ విషయాన్ని అనేక పర్యాయాలు ఇరగేషన్ అధికారులకు తెలియజేసిన పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొల్లిపర సమీపంలో రేపల్లె కాల్వపై ఏర్పాటు చేసిన వంతెన దగ్గర చినకరకట్ట రోడ్డు కోతకు గురైంది. అదే విధంగా వల్లభాపురం సమీపంలో హైస్కూల్ దగ్గర చినకరకట్ట రోడ్డు కోతకు గురికావటంతో ఎప్పుడు ఏ సమయంలో ప్రమాదాలు జరుగుతాయోమోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.